ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -279 పేజీలు - 08 వెల - 04/- శనివారం16 ఆగస్టు 2025

# ఆడబిడ్డల గౌరవం పెంచేలా చర్యలు

## స్త్రీశక్తి పథకానికి జెండా ఊపిన సిఎం చంద్రబాబు

### సూపర్ సిక్స్ ..సూపర్ హిట్

హామీలన్నీ అమలు చేస్తున్నాం

ఆడబిడ్డల గౌరవం పెంచేలా చర్యలు

ఉచిత బస్సుతో మహిళలు ఎక్కడైనా ప్రయాణించే వీలు



**విజయవాడ, ఆగస్ట్15(ఆంధ్ర ప్రగతి**

'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా ఏపీలో కూటమి ప్రభుత్వం మరో కీలక హామీని నెరవేర్చింది. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో 'స్త్రీశక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. విజయవాడలో స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించే ముందు మాట్లాడారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్రమే తమ లక్ష్యమన్నారు. ఆడబిడ్డల గౌరవం పెంచేందుకు ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు మంచి చేశామనే తృప్తి కలుగుతోందన్నారు. రాష్ట్రమంతా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. మిగతాది 2లో...

# దేశ రక్షణకు 'సుదర్శన చక్రం'



- ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ప్రకటన
- 2035 నాటికి అత్యాధునిక ఆయుధ వ్యవస్థ అభివృద్ధి లక్ష్యం
- కీలక ప్రాంతాలకు పటిష్ఠమైన భద్రతా కవచం ఏర్పాటు
- శ్రీకృష్ణుడి ఆయుధం స్ఫూర్తితో ఈ మిషన్‌కు నామకరణం
- యువతకు పిఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన
- దీపావళి నుంచి జిఎస్టీ సవరణలు అమలు
- ఎర్రకోటపై జెండా ఆవిష్కరించి..ప్రసంగించిన ప్రధాని మోడీ

2లో.



# ట్రంప్-పుతిన్ సమావేశం..

2లో.

## కనీవినీ ఎరుగని భద్రత!

ట్రంప్-పుతిన్ కీలక భేటీకి వేదికగా అలస్కా

వారం రోజుల వ్యవధిలోనే హడావుడిగా ఏర్పాట్లు

ఒకరికి మించి ఒకరు.. అమెరికా-రష్యా ఏజెంట్ల మధ్య నువ్వానేనా అన్నట్టు ఏర్పాట్లు

# గుడ్ గవర్నెన్స్‌తో పట్టాలపైకెక్కిస్తున్నాం

- ఎగువ నుంచి వరదను,బురదను భరిస్తున్నాం
- వృధానీటిని వాడుకుంటే తప్పేంటి
- రాయలసీమను సస్యశ్యామలం చేస్తాం
- బనకచర్లతో ఎవరికీ నష్టం లేదన్న చంద్రబాబు
- రాష్ట్రాన్ని పునర్నిర్మించాలనే ఏకైక లక్ష్యం
- ఎపికి పెట్టుబడుల వెల్లువ

విజయవాడ,**ఆగస్ట్15(ఆంధ్ర ప్రగతి** గత వైకాపా ప్రభుత్వం ఏపీ బ్రాండ్‌ను నాశనం చేసింది. వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయింది. రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలతో ఆర్థిక విధ్వంసం చేశారు. ఆ ఐదేళ్లు ఎక్కడా అభివృద్ధి జరగలేదని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మిగతాది 2లో...



# రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్..

హాజరైన సీఎం, డిప్యూటీ సీఎం దంపతులు



విజయవాడ, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్ భవన్‌లో గురువారం నాడు ఎట్ హెూమ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు ఆయన భార్య అన్నా లేజినోవా దంపతులు హాజరయ్యారుమిగతాది 2లో...

# మళ్లీ మూడు రోజుల పాటు వర్షాలు..



విశాఖపట్నం, ఆగస్టు 15: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. అది దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తా తీరాలు, వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఆనుకుని ఉన్న ప్రాంతాలలో కొనసాగుతోందని విశాఖపట్నం తుఫాన్ హెచ్చరిక కేంద్రం అధికారి నాగభూషణం వెల్లడించారు. వీటి ప్రభావంతో రాగల మూడు రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అయితే శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశముందని చెప్పారు.ఈ నేపథ్యంలో తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. అలాగే కోస్తా తీర ప్రాంతంలోని అన్ని ప్రధాన పోర్టులలో మూడవ నెంబర్ ప్రమాద హెచ్చరిక ఇప్పటికే జారీ చేశారని వివరించారు. చేపల వేటకు సముద్రంలోకి వెళ్లవద్దంటూ మత్స్యకారులకు సూచించారు.

# నీటి వాటాలలో రాజీలేదు

- కృష్ణ,గోదావరి జలాలను పూర్తిగా వినియోగిస్తాం
- హైడ్రాతోనే హైదరాబాద్‌కు రక్షణ ● కాళేశ్వరంతో అప్పులకుప్ప చేసిన గత ప్రభుత్వం
- గోల్కొండ నుంచి సిఎం రేవంత్ ప్రసంగం

హైదరాబాద్,**ఆగస్ట్15(ఆంధ్ర ప్రగతి**

కృష్ణా గోదావరి జలాల్లో మన వాటాల సాధనలో రాజీ పడబోమని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూనే.. శాశ్వత హక్కుల సాధనలో విజయం సాధించేలా ప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికతో పని చేస్తుందన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటా విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మిగతాది 2లో...





# గెలిస్తే న్యాయం.. ఓడిపోతే అన్యాయమా?

- ఆంధ్రప్రదేశ్ కు అది డార్క్ సమయం.. వైసీపీ పాలనపై పవన్ విమర్శ
- కాకినాడలో స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం
- స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో కూటమి పాలన
- వైసీపీ హయాంలో గొంతెత్తితే దాడులు జరిగేవని ఆరోపణ

2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# గుడ్ గవర్నెన్స్‌తో పట్టాలపైకెక్కిస్తున్నాం

**(మొదటి పేజీ తరువాయి)**
అవకతవకలు వెలుగుచూస్తున్నాయి. పోలవరం నిలిచిపోయింది. అవరావతి ఆగిపోయింది. పెట్టుబడులు తరలిపోయాయని అన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయజెండాను ఆవిష్కరించారు.పోలీసుల గౌరవ వందనం స్వకీరించారు. అనంతరం మాట్లాడుతూ... 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌కు మొదటి ముఖ్యమంత్రిగా ప్రజలు తనకు అవకాశం కల్పించారని చంద్రబాబు తెలిపారు. అనుభవం, ప్రజల సహకారంతో కష్టపడి దేశంలో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీని నిలిపామన్నారు. 019లో వచ్చిన ప్రభుత్వం 5 సంవత్సరాల పాటు- రాష్ట్రాన్ని విధ్వంసం చేసింది. 2024 ఎన్నికల్లో ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలవాలి అనే ఎన్డీయే నినాదాన్ని ప్రజలు నమ్మి చరిత్రాత్మక తీర్పునిచ్చారు. నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించారు. 94 శాతం ÷-స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో కూటమిని దీవించారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించాలనే ఏకైక లక్ష్యంతో పాలన ప్రారంభించాం. మేం అధికారాన్ని చేపట్టిన ఏడాదిలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా, భవిష్యత్తుకు బాటలు వేసేలా పని చేశాం. తొలి సంతకం నుంచి సుపరిపాలన వైపు అడుగు వేశాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో సాగిన ఏడాది పాలన ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ప్రజల మద్దతు, మా సంకల్పం, దేవుడి దయతో విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం చేస్తున్నాం. నేను ఈరోజు సవినయంగా, సగర్వంగా చెబుతున్నా కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి సాటి లేదు.. అభివృద్ధికి అడ్డు లేదు.. సుపరిపాలనకు పోటీలేదు. ఇది రికార్డు.. ఇదే ఆల్-టైమ్ రికార్డు అని మరోసారి చెబుతున్నా. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం. బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం అని అన్నారు. పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించాం. పంద్రాగస్టు వేడుకల్లో బనకచర్లపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. బనకచర్లతో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. బనకచర్లపై ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని.. సముద్రంలోకి వృథాగా పోయే నీటినే వాడుకుంటాం అని అన్నారు. విజయవాడలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోమాట్లాడుత..ఎగువ రాష్ట్రాల వరద నీటితో నష్టాలనూ భరిస్తున్నామని.. అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరమేంటి? అని పరోక్షంగా తెలంగాణ సర్కార్‌కు ప్రశ్నను సంధించారు. వరదను భరించాలి కానీ ఆ నీటిని వాడుకోవద్దా? అని నిలదీశారు. కాగా రాయలసీమను నీటితో



సశ్యశామలంగా చేసేందుకు బనకచర్ల ప్రాజెక్ట్ ను నిర్మిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. అయితే దీనికి తెలంగాణ సర్కార్ నో చెప్పడంతో వివాదం రాజుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య వివాదం నడుస్తూనే ఉంది.. అయితే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం చంద్రబాబు నాయుడు.. బనకచర్లతో ఎవరికీ నష్టం జరగదు.. గోదావరి వృథా జలాలతో రాయలసీమను సస్యశ్యామలం చేస్తాం.. బనకచర్ల ద్వారా గోదావరి వృథా జలాలు రాయలసీమకు మళ్లించాలని నిర్ణయించాం అన్నారు.. సముద్రంలోకి వృథాగా పోయే నీటినే వినియోగిస్తాం.. ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదన్నారు.. సముద్రంలోకి వృథా అవుతున్న నీటిని బనకచర్ల ప్రాజెక్ట్ ద్వారా వినియోగించుకుంటే తెలంగాణకి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. వరదలు వచ్చినప్పుడు ఎగువ రాష్ట్రాలు నీటిని విడుదల చేస్తే కష్టనష్టాలు భరిస్తున్నాం. దిగువ రాష్ట్రంగా అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలెందుకు? 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం.
2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. రాయలసీమలో సాగునీరు అందించే ఐకాపై గత ప్రభుత్వ నాటకం ఆడిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే 3,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తూ 2026 జులై నాటికి నీరు ఇస్తామని తెలిపారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు పోలవరం నుంచి బనకచర్లకు నీరు అందిస్తాం అని ప్రకటన చేశారు. మిగులు జలాలను, వరద నీటిని ఉపయోగించుకుంటామని.. వరదను బరించాలి అయితే వాటిని వాడకూడదు అంటే ఎలా అని ప్రశ్నించారు. 785టిఎంసి నీళ్లు వివిధ రిజర్వాయర్ లలో నిల్వ ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.12,157 కోట్ల నిధులు విడుదల చేసింది. నిధుల విడుదలతో సకాలంలో పనులకు కేంద్రం సహకరించింది. 2028 నాటికి 'జల జీవన్ మిషన్' కింద ప్రతి గడపకు సురక్షిత తాగునీరు అందిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో 4 వేల కి.మీ సీసీ రోడ్లు, 250 కి.మీ బీటీ- రోడ్లు నిర్మించాం. ఆరోగ్యాంధ్రప్రదేశ్ విధానంతో వైద్య శాఖను తీర్చిదిద్దాం. సీఎం సహాయనిధి నుంచి ఇప్పటి వరకూ రూ.552 కోట్లు- అందించాం. భవన నిర్మాణాలకు అనుమతులు సులభతరం చేశాం. వంద గజాల్లోపు స్థలాల్లో ఎలాంటి బిల్డింగ్ ప్లాన్ లేకుండానే ఇంటి నిర్మాణలకు అవకాశం కల్పించాం అని అన్నారు.

# అడబిడ్డల గౌరవం పెంచేలా చర్యలు






**(మొదటి పేజీ తరువాయి)**ఈ పథకం ద్వారా 2.64 కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత కాలం దూసుకెళ్తామన్నారు. ఈరోజు గర్వంగా చెబుతున్నా సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయ్యింది. రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. వైకాపా పాలనలో ప్రజలు ఐదేళ్ల పాటు- నవ్వడమే మరిచిపోయారు. ఇంటా, బయట ప్రజలకు ఆనందం లేకుండా పోయింది. ఆడ బిడ్డలకు మహర్దశ వచ్చే వరకు అండగా ఉంటాం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు స్త్రీ శక్తి పథకానికి శ్రీకారం చుట్టాం. మహిళలకు మేలు చేస్తున్నామన్న తృప్తి కలుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాం. మహిళా సాధికారిత కోసమే డ్వాక్రా, మెప్మా సంఘాలు ఏర్పాటు- చేశాం. ఆర్టీసీ కండక్టర్లుగా తొలుత మహిళలను తీసుకున్నది మేమే. మహిళలు త్వరలో ఆర్టీసీ డ్రైవర్లుగా కూడా రావాలని కోరుకుంటున్నామని అన్నారు. ఉచిత బస్సు వల్ల 2.62 కోట్ల మంది మహిళలకు లబ్ధి కలుగుతుంది. రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛను ఇస్తున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' ఇస్తున్నాం. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. మనసుంటే మార్గం ఉంటుందని నిరూపించామని సీఎం చంద్రబాబు అన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, వ్యాపారం, ఆలయ దర్శనం.. ఇలా ఏ పనిమీద అయినా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఇకపై ఉచితంగా ప్రయాణించవచ్చు. ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీశక్తి పథకం ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. స్త్రీశక్తి పథకం..పేద, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి కుటు-ంబాలకు ఆర్థికంగా మేలు చేయనుంది. నిత్యం ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం బస్సుల్లో రాకపోకలు జరిపే మహిళలకు ఇకపై ఛార్జీల భారం ఉండదు. ఇంటర్మీడియట్ నుంచి ఉన్నత విద్య వరకు చదువుకునే విద్యార్థినులు బస్ పాస్‌లు కొనాల్సిన అవసరం లేకుండానే బస్సుల్లో రాకపోకలు సాగించవచ్చు. మహిళా రైతులు, వ్యాపారులు, కూలీ చేసుకునేవారు.. తమ గ్రామాల నుంచి దగ్గరలోని పట్టణాలకు ఉచితంగా ప్రయాణించడం ద్వారా ఛార్జీల రూపంలో ఖర్చు మిగులుతుంది. తిరుపతి, అన్నవరం, శ్రీశైలం, సింహాచలం, ద్వారకాతిరుమల, శ్రీకాళహస్తి. విజయవాడ కనకదుర్గమ్మ వంటి ప్రధాన ఆలయాలకు వెళ్లాలనుకున్నా బస్‌ఛార్జీల భారం కారణంగా వెళ్లలేనివారే అధికం. ఇకపై ఇటు-వంటి కుటు-ంబాల్లో మహిళలకు బస్‌ఛార్జీల భారం లేకపోవడంతో.. తక్కువ ఖర్చుతో ఆలయాలకు వెళ్లివచ్చేందుకు అవకాశం ఏర్పడుతోంది. మొత్తంగా స్త్రీశక్తి పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి నెలకు సగటున రూ.4 వేల వరకు ఆర్థికంగా మేలు కలుగుతుందని అంచనా. ఐదు రకాల బస్సుల్లో శుక్రవారం సాయంత్రం నుంచి స్త్రీశక్తి పథకం అమల్లోకి వస్తుంది. అప్పటి నుంచి మహిళలకు జీరో ఫేర్ టికెట్లు- జారీచేస్తారు. మహిళలకు ఇచ్చే టికెట్లపై స్త్రీశక్తి పథకం అని ఉంటుంది. ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణిస్తున్నారు.. ప్రయాణ ఛార్జీ ఎంతో ఉంటుంది. ఆ సొమ్మును ప్రభుత్వం రాయితీగా ఇస్తుందని.. ప్రయాణికురాలు చెల్లించాల్సింది సున్నా అని ఉంటుంది. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ- ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చు. కార్యక్రమంలో డిప్యూటీ-సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# దేశ రక్షణకు 'సుదర్శన చక్రం'

**ఆగస్ట్15(ఆంధ్ర ప్రగతి**
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశ రక్షణ రంగంలో ఒక చరిత్రాత్మక ప్రకటన చేశారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు 2035 నాటికి 'సుదర్శన చక్ర' పేరుతో ఒక అత్యాధునిక ఆయుధ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నట్టు ఎర్రకోట వేదికగా వెల్లడించారు. ఈ శక్తిమంతమైన సాంకేతిక రక్షణ కవచం దేశంలోని అన్ని కీలక ప్రాంతాలకు పూర్తి భద్రత కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు.శ్రీకృష్ణుడి ఆయుధమైన సుదర్శన చక్రం స్ఫూర్తితో ఈ మిషన్‌కు పేరు పెట్టినట్టు ప్రధాని తెలిపారు. ఇది భారత రక్షణ వ్యూహంలో ఒక సాహసోపేతమైన మార్పుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. "మారుతున్న యుద్ధ తంత్రాలకు అనుగుణంగా, వచ్చే పదేళ్లలో దేశానికి ఒక పటిష్ఠమైన సుదర్శన చక్ర కవచాన్ని నిర్మించేందుకు మేము కట్టుబడి ఉన్నాము. 2035 నాటికి ఈ జాతీయ భద్రతా కవచాన్ని విస్తరించి, బలోపేతం చేసి, ఆధునికీకరిస్తాం. ఇందుకోసం దేశం 'సుదర్శన చక్ర మిషన్'ను ప్రారంభిస్తుంది" అని ప్రధాని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు.
ఈ మిషన్‌లో భాగంగా శత్రువుల దూకుడును అడ్డుకోవడమే కాకుండా, శక్తిమంతమైన ప్రతిదాడి చేసేందుకు వీలుగా కచ్చితమైన లక్ష్యాలను ఛేదించే వ్యవస్థ, అత్యాధునిక ఆయుధ సంపత్తిని సమకూర్చుకోనున్నట్టు ఆయన వివరించారు. రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలతో సహా దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన ప్రదేశాలన్నింటినీ ఈ జాతీయ భద్రతా కవచం కిందకు తీసుకువస్తామని తెలిపారు.గత పదేళ్లలో అభివృద్ధి చేసిన టెక్నాలజీతో 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్ నుంచి వచ్చిన క్షిపణులు, డ్రోన్ల దాడులను భారత్ సమర్థవంతంగా నిలువరించిందని ప్రధాని గుర్తుచేశారు. యుద్ధ రంగంలో టెక్నాలజీ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో, భారత సైనిక శక్తిని నిరంతరం మెరుగుపరుస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# గెలిస్తే న్యాయం.. ఓడిపోతే అన్యాయమా?

- **ఆంధ్రప్రదేశ్ కు అది డార్క్ సమయం.. వైసీపీ పాలనపై పవన్ విమర్శ**

**ఆగస్ట్15(ఆంధ్ర ప్రగతి**
2019 నుంచి 2024 వరకు ఆంధ్రప్రదేశ్ లో చీకటి పాలన కొనసాగిందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోపించారు. బ్రిటీష్ పాలన మాదిరిగా నాటి వైసీపీ పాలన సాగిందని అన్నారు. ఈ మేరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కాకినాడలో జరిగిన వేడుకల్లో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎంతోమంది మహానుభావుల త్యాగఫలమే స్వాతంత్ర్యం అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.
స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పెట్టుబడులు రావాలన్నా శాంతి భద్రతలు బలంగా ఉండాలని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా, నిర్భయంగా, స్వేచ్ఛగా జీవిస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వంలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

**గెలిస్తే న్యాయం.. ఓడిపోతే అన్యాయమా?**
ప్రతిపక్ష నాయకుల తీరు ఎన్నికల్లో గెలిచినప్పుడు ఒకలా, ఓటమి పాలైతే మరోలా ఉంటుందని పవన్ కల్యాణ్ విమర్శించారు. 'ఓడిపోతే ఓటు చోరీ అంటున్నారు.. గెలిచినప్పుడు ఒక న్యాయం.. ఓడినప్పుడు మరో న్యాయమా?' అని నిలదీశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో ఎవరైనా గొంతెత్తితే దాడులు జరిగేవని ఆరోపించారు. అవినీతికి అలవాటుపడిన వాళ్లు ఏమైనా చేస్తారు, ఎంతకైనా తెగిస్తారని పవన్ కల్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# నీటి వాటాలలో రాజీలేదు

**(మొదటి పేజీ తరువాయి)**
నీటి కోసమే ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణ వాటాలోని ప్రతి చుక్కా నీటిని తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరి ఒత్తిడికి లొంగేది లేదు.. బెదిరేది లేదని.. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను తీసుకుని తీరుతామని తేల్చి చెప్పారు. 4 కోట్ల ప్రజల పక్షాన తెలంగాణ హక్కులను సాధించుకుంటామన్నారు. తెలంగాణకు నీరు ఇచ్చాకే మిగితా ఎవరి-కై-నా ఇచ్చేదన్నారు. ఎవరెన్నీ కుట్రలు చేసిన తిప్పికొట్టే బాధ్యత మాదని అన్నారు. హైదరాబాద్ తెలంగాణకు బలమని.. రాష్ట్ర రాజధానిలో సగర్వంగా మిస్ వరల్డ్ కాంపిటిషన్ నిర్వహించుకున్నామని గుర్తు చేశారు. ప్రపంచ నగరాలతో పోటీ- పడేలా హైదరాబాద్‌ను మరింత తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయాలని.. ఇందు కోసం తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంటరీని రూపొందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంటరీని ఈ ఏడాది డిసెంబర్ కల్లా రిలీజ్ చేసి జాతికి అంకితమిస్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం గోదావరిలో కలిసిపోయిందని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు హైడ్రాను అస్త్రంగా వాడుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురుసినప్పుడు గతంలో పరిస్థితికి, ఇప్పటి పరిస్థితికి భేరీజు వేడుకోండన్నారు. ఎంత భారీ వర్షం పడినా గంటా, రెండు గంటల వ్యవధిలోనే ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి.. వరద నీటిని మళ్లించడంలో హైడ్రా బాగా పని చేస్తోందని ప్రశంసించారు. అక్రమ నిర్మాణాల విషయంలో చర్యలు తీసుకోవడం, చెరువుల పునరుద్ధరణలో హైడ్రా సమర్థవంతంగా పని చేస్తోందన్నారు. హైడ్రా అవసరాన్ని హైదరాబాద్ గుర్తిస్తోందని, హైడ్రాను బూచిగా చూపి రాజకీయ లబ్ది పొందాలనుకోవడం దుర్మార్గం అని విమర్శించారు. పేదలు మురికి కూపంలో జీవితాలు వెల్లదీయాలని సంకుచితంగా ఆలోచించే వాళ్లే హైడ్రాను వ్యతిరేకిస్తూ దానిని ఒక బూచిగా చూపిస్తూ పేదల్లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. ఇప్పటి వరకు హైడ్రా 13 పార్కులు, 20 సరస్సులను ఆక్రమణల నుంచి రక్షించింది. అంబర్ పేట బతుకమ్మ కుంటను పునరుద్ధరించింది. 30 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాపాడింది. ఈరోజు సామాన్య ప్రజలు హైడ్రాకు పాలాభిషేకం చేస్తున్నారు. మేం అధికారం చేపట్టే నాటికి వారసత్వంగా 8 లక్షల 21 వేల 651 కోట్ల అప్పులు, బకాయిలుగా మిగిల్చి వెళ్లారు. దీనిలో 6 లక్షల 71 వేల 757 కోట్ల అప్పులు.. ఉద్యోగుల, ఇతర పథకాలకు సంబంధించిన బకాయిలు 40 వేల 154 కోట్లు-. ఎస్సీ, ఎస్టీ సబ్ ఎ÷-లాన్, సింగరేణి, విద్యుత్ ఇతర విభాగాలకు చెల్లించాల్సిన బకాయిలు లక్షా 9 వేల 740 కోట్లు-. గత పాలకులు చేసిన అప్పును సర్వీస్ చేయడానికి ఇప్పటి దాకా అసలు రూపేణా లక్షా 32 వేల 498 కోట్లు-, వడ్డీలకు 88 వేల 178 కోట్లు- అలిసి మొత్తం 2 లక్షల 20 వేల 676 కోట్ల డేట్ సర్వీసింగ్ చేశాం' అని సీఎం చెప్పారు.

# ట్రంప్-పుతిన్ సమావేశం..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం జరగనున్న అత్యంత కీలక సమావేశానికి అలస్కాలోని యాంకరేజ్ నగరం వేదికైంది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఈ భేటీని ప్రకటించడంతో ఏర్పాట్ల కోసం అమెరికా అధికారులు యుద్ధప్రాతిపదికన పనిచేస్తున్నారు. వందలాది మంది సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, భద్రతా సిబ్బందితో యాంకరేజ్ నగరం ఒక శత్రు దుర్భేద్యమైన కోటలా మారిపోయింది.ప్రస్తుతం అలస్కాలో పర్యాటక సీజన్ కావడంతో ఈ ఏర్పాట్లు అధికారులకు పెను సవాలుగా మారాయి. నగరంలోని హోటళ్లన్నీ నిండిపోవడం, అద్దెకు కార్లు దొరక్కపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కార్గో విమానాల్లో ప్రత్యేక వాహనాలను, కమ్యూనికేషన్ పరికరాలను, వైద్య సామాగ్రిని యాంకరేజ్‌కు తరలిస్తున్నారు. వందలాది మంది ఏజెంట్లు, సిబ్బంది నగరంలో మోహరించారు.ఈ శిఖరాగ్ర సమావేశం యాంకరేజ్‌లోని అతిపెద్ద సైనిక స్థావరమైన "జాయింట్ బేస్ ఎల్మెన్‌డార్ఫ్-రిచర్డ్‌సన్"లో జరగనుంది. ఈ సైనిక స్థావరానికి పటిష్టమైన భద్రత, నియంత్రిత గగనతలం ఉండటంతో పాటు, ప్రజలకు ప్రవేశం లేకపోవడం భద్రతాపరంగా కలిసివచ్చే అంశమని అధికారులు భావిస్తున్నారు. "ఇది పర్యాటక సీజన్ కావడంతో హోటళ్లు, కార్లకు కొరత ఉంది. సమావేశాన్ని సైనిక స్థావరంలో నిర్వహించడం వల్ల చాలా సమస్యలు తీరాయి" అని అలస్కా గవర్నర్ మైక్ డన్లీవీ తెలిపారు.ఈ సమావేశంలో భద్రతా ఏర్పాట్లు అత్యంత క్లిష్టంగా మారాయి. ఇద్దరు అగ్రనేతలకు వారి వారి దేశాల భద్రతా సిబ్బంది రక్షణగా ఉంటారు. అమెరికా గడ్డపై సమావేశం జరుగుతున్నందున, రష్యా భద్రతా సిబ్బందికి సమానంగా అమెరికా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఉంటారు. "ఒకరి తలుపు మరొకరు తెరవరు, ఒకరి వాహనంలో మరొకరు ప్రయాణించరు. సమావేశ గది బయట 10 మంది అమెరికన్ ఏజెంట్లు ఉంటే, మరోవైపు 10 మంది రష్యా ఏజెంట్లు ఉంటారు.

# రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్.

**.(మొదటి పేజీ తరువాయి)**
అలాగే ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్‌తోపాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్.. అతిథుల వద్దకు స్వయంగా వెళ్లి వారిని ఆత్మీయంగా పలకరించారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నంద్యాల జిల్లా లో వైభవంగా
# 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

**-ముఖ్యఅతిథిగా హాజరైన రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి రాజకుమారి గనియ. నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్. -నంద్యాల జిల్లా ఎస్పీ అభిజిత్ సింగ్ రాణా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**
ఆగస్టు 15వ తేదీశుక్రవారం నాడు నంద్యాల జిల్లా కేంద్రం లోని పి.ఎస్.సి%ఙ% కె.వి.ఎస్.సి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ లో అత్యంత వేడుకగా... కన్నుల పండువగా 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి.ఈ వేడుకల లో రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖా మరియు జిల్లామంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ఉదయం 9.05 గం.లకు జాతీయ పతాకావిష్కరణ గావించి రాష్ట్రీయ సెల్యూట్ చేశారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓ సుదర్శన్ రెడ్డి, పట్టణానికి చెందిన ప్రముఖులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సదర్భంగా జిల్లా కలెక్టరు రాజకుమారి గణియా, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలతో కలిసి పెరేడ్ మైదానాన్ని రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖా మరియు జిల్లామంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి పరిశీలించారు.

అనంతరం వివిధ ప్లాటూన్లు మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి.

ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి ప్రజలకు సందేశమిచ్చారు.79వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి మరియు జిల్లా మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ...

జిల్లా ప్రజలందరికీ 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. చిన్నారి బాల బాలికలకు నా శుభాశీస్సులు. ఈ వేడుకలకు విచ్చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, అధికారులు, అనధికారులు, మీడియా ప్రతినిధులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

నేడు మనం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నాం. స్వతంత్రోద్యమంలో పాల్గొన్న మన జాతిపిత మహాత్మా గాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, డా.బి.ఆర్. అంబేద్కర్, డా. బాబు జగ్జీవన్ రావ్, జ్యోతిరావు పూలే, కొమరం భీమ్ వంటి ఎందరో అమర వీరుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత.

ప్రధానంగా ఈ జిల్లాలో పుట్టి పెరిగి ఈ ప్రాంత ప్రజల్లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తి కలిగించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గోసాయి వెంకన్న, వడ్డే ఓబన్న, నంద్యాల కాదర్ బాద్ నర్సింగరావు, ఆంధ్ర తిలక్ గాడిచర్ల హరి సర్వోత్తమరావు, యళ్లూరి స్వామిరెడ్డి, పెండేకంటి వెంకటసుబ్బయ్య, బీవీ సుబ్బారెడ్డి, గుర్రం వెంకటరెడ్డి, గామాగో వంటి మహనీయులందరికీ ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పిద్దాం. ఈ శుభ తరుణంలో దేశభక్తి స్ఫూర్తితో ఆ మహనీయుల ఆశయాలను, లక్ష్యాలను స్వీకరించి వారి స్ఫూర్తిని అనుసరించాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నాను.

ఈ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో జిల్లా మంత్రిగా మీతో పాల్గొనే సదవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కి నా హృదయపూర్వక ధన్యవాదములు.

రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల లక్ష్యసాధనలో కార్యాచరణను వేగవంతం చేసి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల ప్రగతి సాధనకు, జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆధ్వర్యంలో పని చేస్తున్న జిల్లా యంత్రాంగాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ప్రజాప్రతినిధులు, అధికారులందరూ సమన్వయంగా పనిచేసి నంద్యాల జిల్లాను అగ్రభాగాన నిలిపేందుకు మనందరం అంకితం కావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. స్వాతంత్ర దినోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నంద్యాల జిల్లాలో చేపట్టిన మరియు చేపట్టనున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల సంక్షిప్త సమాచారాన్ని ఈ సందర్భంగా మీ ముందు ఉంచుతున్నాను.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమంతో కూడిన సుపరిపాలన అందించారు. ప్రజల జీవన విధానాన్ని మార్చడానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం. 2024 ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు.... అధికారం చేపట్టిన తొలి రోజే మెగా డిఎస్సి, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, ఎన్టిఆర్ భరోసా పించన్ల పెంపు, అన్నా క్యాంటిన్ల పునరుద్ధరణ, నైపుణ్యగణన ఫైళ్ల పై ముఖ్యమంత్రి తొలి సంతకాలు చేసి ప్రజల పట్ల తన కున్న విశ్వసనీయతను, ఆప్యాయతను చాటుకున్నారు. అదే విధంగా చెప్పిన మాట ప్రకారం ఉచిత ఇసుక పాలసీని మన ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నాం. అదేవిధంగా అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించి పేదల కడుపు నింపుతున్నాం. ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేసాం. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గోకులం షెడ్లు నిర్మిస్తూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడం జరిగింది. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే విధంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

స్వర్ణాంధ్ర 2047 విజన్:

భారత స్వాతంత్ర్య శతాబ్ది-నాటికి ఆంధ్రప్రదేశ్ ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం ఇవ్వటమే లక్ష్యంగా పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యం, మానవ వనరుల అభివృద్ధి, ఇంటింటికీ నీటి భద్రత, రైతు - వ్యవసాయ సాంకేతికత, ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్), శక్తి మరియు ఇంధనాల వ్యయ నియంత్రణ, అన్ని రంగాలలో పరిపూర్ణ ఉత్పాదన, సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర, అన్ని దశలలో సమగ్ర సాంకేతికత వంటి 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంతో ముందుకు వెళు_న్నాం.

## వాట్సాప్ గవర్నెన్స్:

పాలనలో టెక్నాలజీ వినియోగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో సెల్ ఫోన్ ద్వారా పౌరసేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఈ రోజు నుండి మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలను 700లకు పెంచాం. 95523 00009 నంబర్ ద్వారా విద్యార్థులకు పరీక్షల హాల్ టికెట్లు, ప్రజలకు రేషన్ కార్డుల సేవలు, తల్లిదండ్రులకు తల్లికి వందనం పథకం స్టేటస్, రైతులకు అన్నదాత సుఖీభవ పథకం స్టేటస్ తెలుసుకునే వెసలుబాటును కల్పించాం.

## ఏపీ పునర్నిర్మాణం దిశగా ' పి- 4':

పేదరిక నిర్మూలనలో భాగంగానే ఉద్యమ స్ఫూర్తితో.. ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో పీ4 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈనెల 19 నుంచి ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈ పథకం ద్వారా సమాజంలో ఆర్థికంగా బలంగా ఉన్నవారు స్వచ్ఛందంగా అట్టడుగున ఉన్న కుటుంబాలు, వ్యక్తులు, గ్రామాల అభివృద్ధిలో తోడ్పడే అవకాశాన్ని కల్పిస్తోంది. పి4 పథకం లక్ష్యం... సమాజంలో ఎవరైతే బాగా ఆర్థికంగా బలంగా ఎదిగారో, అట్టడుగున ఉన్న బడుగు వర్గాలకు సహాయం అందిస్తే అసమానతలు తొలగుతాయి. సమాజంలో సమానత్వం నెలకొంటుంది. ప్రతి ఒక్కరూ వెల్తీ, హెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ పౌరులుగా జీవించగలుగుతారు. ఈ ఉద్దేశంతో ప్రభుత్వం ఒక సర్వే నిర్వహించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాల్సిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించింది. సహాయం చేయగల సామర్థ్యం ఉన్న వారిని మార్గదర్శకులుగా గుర్తించి నమోదు చేసింది. ఈ పథకం పూర్తిగా స్వచ్ఛందమే. గుర్తించిన బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలను ఏర్పరిచే లక్ష్యంతో పని చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పం. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుంది. జిల్లాలో ఇప్పటి వరకూ గుర్తించబడిన 42,903 బంగారు కుటుంబాలను గుర్తించిన 5,327మార్గదర్శకులకు దత్తత ఇవ్వడం జరిగింది. బంగారు కుటుంబాలకు ఉన్న అవసరాలను కూడా సర్వే ద్వారా గుర్తించడం జరిగింది. దత్తత తీసుకున్నమార్గదర్శకులు బంగారు కుటుంబాల అవసరాలను ప్రాధాన్యత క్రమంలో అందించి ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నాను.

## స్త్రీ శక్తి - మహిళలకు ఉచిత బస్సు:

"సూపర్ సిక్స్" హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని ఈరోజు నుండి రాష్ట్రంలో అమలు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని తెలపడానికి ఎంతో సంతోషిస్తున్నాను. ఈ పథకం అమల్లో ఎలాంటి లోటుపాట్లు, విమర్శలకు అవకాశం లేకుండా పకడ్బందీగా అమలు చేసేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించాం. ఈ పథకం క్రింద రాష్ట్రానికి చెందిన మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని కల్పిస్తున్నాం. ఆర్టీసీలోని పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ తదితర 8 వేల 456 బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఏర్పాట్లు చేశాం. ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐ.డి.ప్రూఫులుగా చూపించి ప్రయాణించే వెసులుబాటును కల్పించాం. ఈ పథకం నిమిత్తం అదనంగా నూతన బస్సులను, విద్యుత్ బస్సులను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది.





## అన్నదాత సుఖీభవ:

సూపర్‌సిక్స్ హామీల్లో అత్యంత కీలకమైన 'అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం' ద్వారా ఏడాదికి రూ.20వేలను అర్హులైన రైతులకు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆగస్టు 2 నుంచి పథకాన్ని అమలు చేస్తోంది. అన్నదాత సుఖీభవ పథకం రైతుకు ఆర్థిక సహాయం మాత్రమే కాదు. గౌరవం, భరోసా ఇచ్చే పథకం. రైతు ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి వర్యుల ధ్యేయం.

"రైతు సుఖమే %-% రాష్ట్ర అభివృద్ధికి పునాది" అనే నినాదంతో అర్హత గల ప్రతి రైతుకు నేరుగా ఆర్థిక సహాయం అందజేయడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడం, రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ఈ పథక ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద మొదటి విడతగా జిల్లాలో 2లక్షల 6 వేల మంది రైతుల ఖాతాల్లో 140 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగింది. 2025 ఖరీఫ్ సీజన్ కు రూ.9,966 కోట్ల ఆర్థిక లక్ష్యానికి గాను ఇప్పటివరకు 4,579 కోట్ల రూపాయల పంట రుణాలను బ్యాంకుల ద్వారా రైతులకు అందించాం. కౌలు రైతుల సంక్షేమం కొరకు 12,795 పంట సాగు హక్కు పత్రాలు జారీ చేశాం. 6 వేల మంది కౌలు రైతులకు కూడ రుణాలు మంజూరు చేయడమైనది.

జిల్లాలో ఆగస్టు వరకు సాధారణ వర్షపాతం 279.4 మిల్లీమీటర్లు కాగా ఇప్పటివరకు 293.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఈ సంవత్సరంలో ఆశాజనకంగా కురిసిన తొలకరి వర్షాల వలన మరియు రిజర్వాయర్లు పూర్తిగా నిండడంతో జూలై 17వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మల్యాల నుండి ఎత్తిపోతల ద్వారా కాలువలకు నీరు విడుదల చేయడం జరిగింది.

రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే హంద్రీనీవా ప్రాజెక్టులో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతోంది. ప్రతి ప్రాజెక్టు నిండేలా.. ప్రతి చెరువుకు నీరందేలా... చివరి భూములను సైతం తడిపేలా.. అత్యధిక సామర్థ్యంతో హంద్రీ-నీవా కాల్వల్లోని నీటి ప్రవాహాలు రైతన్నల ఆశలను, ఆకాంక్షలను తీరుస్తున్నాయి. రికార్డు సమయంలోనే కాలువ విస్తరణ పనులు చేపట్టిన కారణంగానే ఈ సీజన్లో చివరి భూములకు నీరు అందించాలనే ప్రభుత్వ కల సాకారమవుతోంది. రైతుల సంతోషం ప్రభుత్వ సంకల్పానికి మరింత బలాన్నిస్తోంది.

జిల్లాలో సాధారణ విస్తీర్ణం 5.95 లక్షల ఎకరాలకు గాను ఇప్పటివరకు 3.74 లక్షల ఎకరాలలో పంటల సాగు జరిగింది. ప్రతి సాగుదారునికి డిజిటల్ గా ఈ-పంట నమోదు చేస్తున్నాం. తద్వారా సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్, పంటల బీమా, పంట నష్టపరిహారం, పంటల కొనుగోలు, రుణాల మంజూరు లబ్ధి చేకూరుతుంది. ఇప్పటివరకు 47,150 ఎకరాలలో ఈ-పంట నమోదు చేశారు. 9.38 కోట్ల రూపాయల రాయితీతో 4,415 క్వింటాళ్ల విత్తనాలు, 6.47 కోట్ల నిధులతో 9150 ఎకరాలలో అధిక దిగుబడులకు గాను విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, జీవన ఎరువులు రైతులకు అందజేసే విధంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. 97,438 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు జిల్లా వ్యాప్తంగా సరఫరా చేసాం. వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా 40 శాతం రాయితీతో 2 కోట్ల రూపాయల విలువైన 964 వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందించాం. ముఖ్యమంత్రి చొరవతో వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ అనుసంధానించి. డ్రోన్ టెక్నాలజీని తీసుకొచ్చి సాగు ఖర్చులను, కూలీల కొరతను తగ్గిస్తున్నాం. ఇందుకు 80శాతం రాయితీపై 3.20 కోట్ల రూపాయల విలువైన 40 కిసాన్ డ్రోన్ల ను రైతు గ్రూపులకు అందిస్తున్నాం. జిల్లాలో ప్రస్తుతం 54వేల మంది రైతులకు సంబంధించి 72,148 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం సాగు అవుతోంది.

మిగతాది 4లో...









# నంద్యాల జిల్లా లో వైభవంగా 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.









## ఉద్యాన శాఖ:

నంద్యాల జిల్లాను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ఆశయం. ఉద్యాన పంటల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో 48వేల 250 హెక్టార్లలో 14.27 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో ఉద్యాన పంటలు సాగవుచున్నవి. ఈ ఏడాది ఉద్యాన పంటల సాగులో 7,627 కోట్ల జీవీఏ సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన రైతన్నలకు విజ్ఞప్తి చేస్తున్నాను. మహానంది సుగంధి అరటికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఏడాది 1250 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగుతో పాటు నూతన పంటలైన డ్రాగన్ ఫ్రూట్, నేరేడు, ఉసిరి, అంజూర, జామ, అరటి నూతన వంగడాలను ప్రోత్సహించి పంటల విస్తీర్ణాన్ని పెంచడమే లక్ష్యంగా రైతన్నలకు అవగాహన కలిగేలా కార్యక్రమాలను అమలు చేస్తున్నాం.

## పశుసంవర్ధకం:

జిల్లాలో ఉన్న 23 లక్షల పశువులు, మేకలు, గొర్రెలు కోళ్ల సంపదకు 188 పశు వైద్యశాలలు, 191 రైతు సేవా కేంద్రాలు సేవలందిస్తున్నాయి. మెరుగైన నాణ్యత కలిగిన పశుగ్రాస అభివృద్ధికి 75% రాయితీతో పశుగ్రాస విత్తనాలను రైతన్నలకు పంపిణీ చేయడం జరుగుతోంది. 85శాతం రాయితీతో పశువుల భీమా సదుపాయాన్ని రైతన్నలకు అందుబాటులోకి తీసుకు వచ్చాం. 13 సంచార పశు చికిత్స వాహనాల ద్వారా రైతుల ఇంటి వద్దనే పశు వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నాం. జిల్లాలో 850 మినీ గోకులాలు ఏర్పాటు చేయడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 792 మినీ గోకులాలు పూర్తి చేయడం జరిగింది. ఆవులు, గేదెల షెడ్లకు 90 శాతం, మేకలు, గొర్రెలు, కోళ్లకు 70 శాతం రాయితీతో షెడ్స్ మంజూరు చేయడం జరుగుతోంది.

## సూక్ష్మనీటి సాగు:

భూగర్భ జలాల అనవసర వృధాను అరికట్టేందుకు ఉద్యాన వ్యవసాయ పంటల సాగులో బిందు తుంపర్ల సేద్యాన్ని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 7 వేల హెక్టార్లలో బిందు తుంపర సేద్యం అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఇప్పటివరకు దాదాపు వేయి హెక్టార్లలో రైతులకు బిందు తుంపర పరికరాలు అందజేయడం జరిగింది.

## సాగు మరియు తాగునీటి రంగం:

మన నీరు- మన సంపద అనేది రాష్ట్ర ప్రభుత్వ నినాదం. నీటిని సంపదలా కాపాడుకోవడం మన అందరి బాధ్యత.
రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఆ భగవంతుని అనుగ్రహంతో శ్రీశైలం ప్రాజెక్ట్ నిండుగా ఉంది. కృష్ణానది నిండుగా ప్రవహిస్తోంది. జూలై మొదటి వారంలోనే జలాశయాలన్ని నిండుకుండల్లా మారడం ఎంతో సంతోషించదగిన విషయం. జల వనరుల శాఖ ద్వారా కేసి కాలువ, ఎస్సార్ బీసీ, తెలుగు గంగ, చిన్న నీటి పారుదల చెరువులు, హంద్రీనీవా, ఏపీ ఎస్పెడిసి, సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్, శివ భాశ్య%శీ% ప్రాజెక్టు ల ద్వారా మొత్తంగా 5 లక్షల 98 వేల 779 ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నాం.
సాగు నీటి నిర్వహణ పద్ధతులు మరియు యాజమాన్య పద్ధతుల ద్వారా సరియైన సమయంలో నీటిని అందించడం ద్వారా 2024- 25లో 3,856 కోట్ల వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు రావడం జరిగింది. ఇది 2023 24 కన్నా 44శాతం అధికం. 2023- 24లో కడప జిల్లాకు అత్యధికంగా 28.742 టీఎంసీల నీటిని విడుదల చేయడమైనది. 2025-26లో ఎన్నడూ లేని విధంగా ఒక నెల రోజులు ముందుగా పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని విడుదల చేయడమైనది. నంద్యాల జిల్లా సరిహద్దులో 3000 క్యూసెక్కుల కన్నా ఎక్కువ నీటిని ఈ సంవత్సరం కడప జిల్లాకు అందించడం ఇదే ప్రథమం. నంద్యాల జిల్లాలో తెలుగు గంగ కాలువకు 90 శాతం లైనింగ్ పనులు పూర్తవడంతో టీజీపీ కాలువలోకి 3500 క్యూసెక్కులకు బదులుగా 5000 క్యూసెక్కుల నీటిని వెలుగోడు జలాశయం నుండి విడుదల చేయుచున్నాం.
జిల్లాలో డిసెంబర్ 2024లో నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఎన్నుకోవడం జరిగింది. వివిధ పథకాల ద్వారా 34.65 కోట్ల రూపాయల విలువైన 425 పనులను నీటి సంఘాలకు కేటాయించి త్వరితగతిన పూర్తి చేసి సకాలంలో నీటిని విడుదల చేసాం. నీటిని సమర్థవంతంగా వినియోగించడం, సకాలంలో కాలువలకు అవసరమైన మరమ్మత్తు పనులు పూర్తి చేయడం వంటి చర్యలతో ఈ అభివృద్ధి సాధ్యమైంది.

## జల జీవన్ మిషన్ - వాటర్ గ్రిడ్:

జల జీవన్ మిషన్ పథకం ద్వారా శాశ్వత నీటి సరఫరా కోసం గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన పనులు ప్రగతిలో ఉన్నవి. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కింద డోన్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆరు మండలాలలోని 138 గ్రామాలు, 2 మున్సిపాలిటీల పరిధిలోని 2.86 లక్షల మంది జనాభాకు శుద్ధ తాగునీటిని అందించడానికి రూ.351 కోట్లకు పరిపాలన ఆమోదం లభించింది. ఇందులో 82శాతం పని పూర్తి కావడం జరిగింది. తద్వారా 33 గ్రామాలకు మరియు బేతంచర్ల మున్సిపాలిటీకి త్రాగు నీటిని సరఫరా చేస్తున్నాం. మిగిలిన పనులు ముమ్మురంగా జరుగుతున్నాయి.

## తల్లికి వందనం పథకం:

ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు... ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "తల్లికి వందనం" పథకం ద్వారా ప్రతి బిడ్డకు చదువు నిమిత్తం 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది విద్యార్థులకు తల్లికి వందనం ఆర్థిక లబ్ధి చేకూర్చాం. జిల్లాలో 3 లక్షల 14 వేల 118మంది విద్యార్థుల తల్లులు, సంరక్షకుల బ్యాంకు ఖాతాల్లో ఈ పథకం లబ్ధిని జమ చేయడం జరిగింది.
మనబడి - మన భవిష్యత్తు, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రా, డొక్కా సీతమ్మ గారి మధ్యాహ్న బడి భోజన పథకం తదితర కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది జిల్లాలోని 1,961 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 2 లక్షల 98 వేల 292 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను అందజేయడం జరిగింది. సమగ్ర శిక్ష ద్వారా 55 కోట్ల 94 లక్షల అంచనా ఖర్చుతో పాఠశాలల్లో మౌలిక వసతులు, సైన్స్ ల్యాబ్లు, ప్లే గ్రౌండ్ లు, సోలార్ ప్యానల్స్, భవనాలు, కళాశాలల నిర్మాణం తదితర మంజూరైన పనులు పురోగతిలో ఉన్నవి.
డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కాలేజీల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం సన్నబియ్యంతో రుచికరమైన ఆహార పదార్థాలను అందిస్తున్నాం. పిల్లల్లో ఉన్న అభ్యాసనా సామర్థ్యాలు, ఆసక్తి ఉన్న అంశాలను గుర్తించి భవిష్యత్తులో ఏ విధంగా మెరుగుపరచాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదిగేలా కృషి చేస్తున్నాం.

## మెగా డీఎస్సీ ఫలితాలు విడుదల:

ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీని నిర్వహించాం. తద్వారా రాష్ట్రంలో 16,347 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తోంది. కర్నూలు మరియు నంద్యాల ఉమ్మడి జిల్లాకు సంబంధించి 2,674 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నాం. ఈనెల 12న డీఎస్సీ ఫలితాలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ వెబ్సైట్ ద్వారా ఫలితాలు, స్కోర్ కార్డులను అందుబాటులోకి తీసుకురావడమైనది. జిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపిక కానున్న వారందరికీ ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ కారణంగా జిల్లాలో పాఠశాలల సంఖ్య 1260 నుండి 1336కి పెరిగింది.

## నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్మెంట్):

కళాశాల విద్యార్థులు రెగ్యులర్ అకాడమిక్స్ ను అభ్యసిస్తున్నప్పుడు వారి నైపుణ్య మరియు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి జిల్లాలో 18 ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో ఆన్లైన్ ఆఫ్ లైన్ ద్వారా కంప్యూటర్ కోర్సులు కమ్యూనికేషన్స్ స్కిల్స్ అండ్ లైఫ్ స్కిల్స్ లలో శిక్షణ ఇస్తారు.

## స్కిల్ హబ్ - స్కిల్ కాలేజీ:

ప్రస్తుతం ఉన్న సాంకేతిక, వృత్తి విద్య మరియు శిక్షణ పర్యావరణ వ్యవస్థను పారిశ్రామిక డిమాండ్ కు అనుగుణంగా మరియు లాభదాయకమైన ఉపాధిని అందించాలనే అంతిమ లక్ష్యంతో మార్కెట్ కు అనుసంధానంగా మార్చాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో ఏడు స్కిల్ హబ్స్ ఉన్నాయి. పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న వారికి ఈ స్కిల్ హబ్ లో శిక్షణ మరియు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుంది. ఈ ఏడాది వివిధ జాబ్ మేళాలు నిర్వహించి 1400 మంది చదువుకున్న యువతకు వివిధ ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించడమైనది.

## వైద్యరంగం మరియు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్:

ప్రజా ఆరోగ్య సంరక్షణే - ప్రభుత్వ ధ్యేయం. ప్రభుత్వ ఆసుపత్రులలో సురక్షిత ప్రసవాల ద్వారా మాతా శిశు మరణాలను తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఇప్పటివరకు 24.73 కోట్ల రూపాయలను ఖర్చు చేసి 12,987 మందికి ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా శస్త్ర చికిత్సలు అందించడం జరిగింది. అలాగే జనని సురక్ష, మాతృత్వ వందన యోజన ద్వారా 14,550 మంది గర్భిణీ స్త్రీలకు 4కోట్ల 42 లక్షల రూపాయలను చెల్లించాం.

## ఎన్టీఆర్ భరోసా పింఛను:

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జిల్లాలో 2 లక్షల 15 వేల 700 మందికి 92 కోట్ల 85 లక్షల రూపాయలను ప్రతినెల 1వ తేదీన పంపిణీ చేస్తున్నాం.
డిఆర్డిఏ- వెలుగు ద్వారా బ్యాంకు లింకేజీ పథకం కింద గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘ సభ్యులు తమ జీవనోపాధులు మెరుగుపరుచుకోవడానికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2,876 సంఘాలకు 293 కోట్ల రూపాయలను ఋణాలుగా అందించడం జరిగింది.

## నమో డ్రోన్ దీది:

స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారత మరియు మహిళలకు డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం అందించి వ్యవసాయ రంగంలో సేవా రుసుము ద్వారా రైతులకు అందుబాటులో ఉంచడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. మహిళలకు డ్రోన్ పైలెట్ మరియు డ్రోన్ అసిస్టెంట్ల శిక్షణ ఇప్పించి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో డ్రోన్ సేవలను రైతులకు అందుబాటులోకి తేవడం జరుగుతుంది. ఈ పథకం కింద ఒక డ్రోన్ ఖరీదులో 80శాతం మేర గరిష్టంగా 8 లక్షల వరకు రాయితీ మంజూరు చేస్తారు. 2025- 26 సంవత్సరానికి జిల్లాకు దాదాపు 30 డ్రోన్లు కేటాయించారు. ఇందుకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది.

## పేదలందరికీ ఇళ్ళు:

ఇళ్ళు లేని ప్రతి ఒక్కరికి ఇంటిని నిర్మించి ఇచ్చేందుకు మన ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు చొప్పున ఇల్లు లేని ప్రతి పేద వారికి ఇంటి పట్టాలు పంపిణి చేయుటకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలో ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. పట్టణ గ్రామీణ ప్రాంతాలలో రూ.1073కోట్ల అంచనాతో మంజూరైన 59,517 గృహాలకు గాను 31,567 గృహాలను పూర్తి చేయడం జరిగింది. పూర్తికాని ఇళ్లను త్వరితగతిన నిర్మించేందుకు అదనపు ఆర్థిక సహాయం కింద ఎస్సీ, బీసీలకు 50 వేల రూపాయలు, ఎస్టీలకు 75 వేలు, చెంచులకు లక్ష రూపాయలను ప్రభుత్వం అందిస్తోంది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని త్వరితగతిన ఇళ్ళను పూర్తి చేసుకోవాలి.

## ఉపాధి హామీ పథకం:

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. ఈ పథకం కింద 2 లక్షల 49 వేల కుటుంబాల ఉపాధి శ్రామికులకు జాబ్ కార్డులు పంపిణీ చేశాం. ప్రతి కుటుంబానికి వందరోజుల పని దినాలు కల్పిస్తున్నాం. 2025 26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన విధంగా 49 లక్షల పని దినాలు కల్పించాం. 1.50 లక్షల కుటుంబాల్లోని 2 లక్షల 48వేల మంది ఉపాధి శ్రామికులకు 128 కోట్ల రూపాయలను వేతనాల రూపంలో చెల్లించాం. తద్వారా శ్రామికులకు రోజుకు రూ.261.56ల సరాసరి వేతనం అందించడం జరిగింది. గ్రామాల్లో స్థిరమైన అభివృద్ధి కోసం గోకులం షెడ్లు, పశువుల తాగునీటి తొట్టెలు, ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు కొరకు 35 కోట్ల 77 లక్షల రూపాయల అంచనాతో 9950 పనులను చేపట్టి 3,512 పనులను పూర్తి చేయడం జరిగింది. మిగిలినవి పురోగతిలో ఉన్నాయి.

## పరిశ్రమలు:

మన కూటమి పెట్టుబడుల ఫ్రెండ్లీ ప్రభుత్వం. జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారా అభివృద్ధి పథంలో పయనించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో 30 కోట్ల రూపాయల పెట్టుబడితో స్థాపించిన 890 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారా 3వేల మందికి ఉపాధి కల్పించడం జరిగింది. వివిధ పరిశ్రమల స్థాపనకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 715 అనుమతులు మంజూరు చేశాం.

## మహిళా శిశు అభివృద్ధి:

సమగ్ర శిశు అభివృద్ధి పథకం ద్వారా 1663 అంగన్వాడి కేంద్రాల్లో బాల సంజీవని సంపూర్ణ పోషణ కింద 11,200మంది గర్భిణీ స్త్రీలు, 8వేల మంది బాలింతలు, 85వేల మంది చంటి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం. ఈ ఏడాది స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా 133 అంగనవాడి కేంద్రాలకు టాయిలెట్లు మంజూరు అయినవి. బాల్య వివాహాల నిర్మూలనకు అంగన్వాడి%స్త్ర% కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 హెల్ప్ లైన్ కు ఫోన్ చేసి తెలుపవచ్చు.

## పౌరసరఫరాలు:

ఈనెల 25వ తేది నుంచి పండుగ వాతావరణంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నాం. రాష్ట్రంలో కోటి 21 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాత రేషన్ కార్డుల ప్లేస్‌లో డిజిటల్ కార్డులు అందించనున్నాం. కొత్త రేషన్ కార్డులపై రాజకీయ నాయకుల ఫొటోలు ఉండవు. ఎక్కడికైనా తీసుకెళ్లేలా డెబిట్, క్రెడిట్ కార్డు సైజులో క్యూఆర్ కోడ్ తో కొత్త రేషన్ కార్డులు అందిస్తారు. ప్రతినెలా ఒకటి నుంచి 15 వరకు రేషన్ డిపోలు నిర్ణీత సమయాలలో తెరిచి వుంచాలని, సరుకుల వివరాలు తెలిపే బోర్డులు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నాం. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ సరఫరా చేస్తారు. ఐదేళ్ల లోపు, 80 ఏళ్లు దాటిన వారికి ఈకేవైసీ అవసరం లేదు. ప్రతి నెల 25 నుంచి 30 వరకు వృద్ధులకు రేషన్ డోర్ డెలివరీ చేయబడుతుంది. జిల్లాలోని 5లక్షల 35 వేల 185 మంది తెల్ల రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నాం. దీపం-2 పథకం కింద రెండవ విడత 2025 ఏప్రిల్ నుండి జూలై మధ్య 3లక్షల 51వేల 575మంది లబ్ధిదారులు ఉచిత గ్యాస్ సిలిండర్లను వినియోగించుకొని 27 కోట్ల 75 లక్షల సబ్సిడీ మొత్తాన్ని పొందారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర:

"ఆరోగ్యం ద్వారా అభివృద్ధి - పరిశుభ్రత ద్వారా ప్రగతి" అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాం. "నూతన సంవత్సరం - శుభ్రతతో ప్రారంభిద్దాం" అనే నినాదంతో జనవరి మాసం నుంచి జిల్లా అంతటా స్వచ్ఛత కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాం. ప్రతినెల ఒక్కొక్క నినాదంతో స్వచ్ఛత కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయడం జరుగుతోంది. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు నందించి స్వర్ణాంధ్రకు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. "సే నో సింగిల్ యూజ్ ప్లాస్టిక్" నినాదంతో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా నందలి 489 గ్రామపంచాయతీలకు గాను 341 పంచాయతీలలో చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాలను నిర్మించడం జరిగింది. ఈ ఏడాది చివరి నాటికి మిగిలిన వాటిని కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం మరియు త్రాగునీటి కార్యకలాపాలను %ా= - ాచీజు% యాప్ ద్వారా ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతోంది.

## అన్నా క్యాంటీన్లు:

నిరుపేదలు, కూలి నాలి చేసుకునే వారు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం అన్నా క్యాంటీన్ లను పున: ప్రారంభించింది. జిల్లాలోని మునిసిపాలిటీల్లో 6అన్నా క్యాంటీన్లను ప్రారంభించి మూడు పూటలా 5 రూపాయలకే రుచికరమైన ఆహార పదార్థాలను అందిస్తున్నాం.

## విద్యుత్ రంగం:

ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనికోసం విద్యుత్ చార్జీలను పెంచకుండానే పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం. గత ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచడమే కాకుండా విద్యుత్ రంగ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ప్రస్తుతం వ్యవసాయానికి విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే విద్యుత్ రంగాన్ని మెరుగుపరిచాము.

## పి యం సూర్యఘర్:

పి యం సూర్యఘర్ ముఫ్ట్ బిజిలి యోజన పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇళ్ళ పైకప్పులపై సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేసుకుని ఉచితంగా విద్యుత్ పొందాలని కోరుతున్నాను. ఇప్పటివరకు జిల్లాలో 975 సోలార్ రూఫ్ టాప్ లను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచితంగా 2 కిలోవాట్ల సోలార్ సిస్టం ఏర్పాటు నిమిత్తం 13వేల 973 మంది ఎస్టీ, ఎస్టీ వినియోగదారులను ఏపీఎస్పీడీసీఎల్ ఎంపిక చేసింది.జిల్లాలో 386 వ్యవసాయ ఫీడర్స్ ద్వారా ఒక లక్ష 10 వేల 346 మంది రైతన్నల వ్యవసాయ పంపుసెట్లకు పగటి పూట 9 గంటల పాటు నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

## జాతీయ రహదారులు:

జిల్లాలో రూ.3వేల 474 కోట్లతో 240 కిమీల మేర చేపట్టిన ఎనిమిది జాతీయ రహదారుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటోంది.

## ఆర్ అండ్ బి:

రోడ్లు మరియు భవనాల శాఖ ద్వారా ప్రజలకు సురక్షితమైన రహదారులు, మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా బనగానపల్లె నియోజకవర్గం లో ఇటీవల "డ్యానిష్ ఫైబర్ టెక్నాలజీ"తో ప్రయోగాత్మకంగా రెండు కిలోమీటర్ల రహదారి నిర్మించడమైనది. ఈ టెక్నాలజీ వల్ల రహదారుల మన్నిక రెండు రెట్లు పెరుగుతుంది. మిషన్ పాట్ హోల్ ఫ్రీ కింద 11 కోట్ల రూపాయలతో గుంతలు ఉన్న 430 కిలోమీటర్ల రహదారుల్లో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని పూర్తి చేశాం. బనగానపల్లె పట్టణానికి మంజూరైన 15.37 కిమీల బాహ్యవలయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా వివిధ పథకాల కింద రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ.113 కోట్ల తో 77 పనులు మంజూరు అయినవి. ఇందులో 18 పనులు పూర్తికాగా మిగిలినవి పురోగతిలో ఉన్నవి.

## పంచాయతీరాజ్:

పల్లె పండుగలో భాగంగా ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో జిల్లా వ్యాప్తంగా 86 కోట్ల రూపాయలతో 1026 సిమెంట్ రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించి ఇప్పటివరకు 956 పనులు పూర్తి చేశాం. వివిధ పథకాల కింద రూ.385.59 కోట్లతో చేపట్టిన 370 పనులలో 88 పూర్తి కాగా, మిగిలిన పనులు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయి.

**పర్యాటకం %-% యువజన సర్వీసులు మరియు క్రీడలు:**

జిల్లాలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. తద్వారా ఈ రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. జిల్లాలోని అన్ని పర్యాటక ప్రదేశాలను 7 టూరిజం సర్క్యూట్లుగా విభజించడం జరిగింది. స్వదేశీ దర్శన్ 2.0 చాలెంజ్ డెస్టినేషన్ పథకం కింద అహోబిలం ను రూ.2కోట్లతో అభివృద్ధి చేయు పనులు పురోగతిలో ఉన్నవి. అలాగే చదువుతోపాటు యువత క్రీడలపై కూడా దృష్టి పెట్టి రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.





















# కళారాధన,దివ్యాంగుల సంక్షేమ సంఘం ,క్రీడా సమాఖ్య కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

## -జాతీయ పతాకం ఆవిష్కరణ చేసిన డాక్టర్ రవి కృష్ణ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**
నంద్యాల కళారాధన,జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, క్రీడా సమాఖ్య కార్యాలయం వద్ద ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ 79వ దేశ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పతాక వందనం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగంలో అంకితభావంతో పనిచేసి దేశఅభివృద్ధిలో పాలుపంచుకోవలసిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య,కార్యదర్శి రామలింగం, ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి ,వెంకటరావు, సంయుక్త కార్యదర్శి చలపతి, కార్యవర్గ సభ్యులు రంగస్వామి, వీర



భరతుడు,దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు షాహీనూర్, జిల్లా చెస్ సంఘం



కార్యదర్శి సుబ్బారెడ్డి, కళారాధన కార్యవర్గ సభ్యులు శివరామిరెడ్డి,రామయ్య, వాసు ,కార్యాలయ కార్యదర్శి మధు, వెంకటేశ్వర్లు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె ఆగస్టు 15:**
ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు %డ% భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు. నేడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి



త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

# వినాయక చవితిని మట్టి విగ్రహాలతో నిర్వహించుకోవాలి.

## మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె ఆగస్టు 15:**
బనగానపల్లె పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చే ప్రయత్నంలో ప్రజలంతా తమ వంతు సహకారం అందిస్తున్న క్రమంలో.. రాబోయే వినాయక చవితి పండుగను కూడా పర్యావరణ అనుకూలంగా మట్టి విగ్రహాలతో నిర్వహించుకోవాలని సూచించిన రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి,వినాయక చవితి పండుగ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై బనగానపల్లె నియోజకవర్గం అధికారులు మరియు కేంద్ర గణేష్ మహోత్సవ సమితి వారితో నేడు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం.
బనగానపల్లి పట్టణం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో, తహసిల్దార్, పట్టణ సీఐ ప్రవీణ్, బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ రెడ్డి, ఎంపీడిఓ, వివిధ శాఖల అధికారులు. ప్రజలు వినాయక విగ్రహాల విషయంలో రంగులు, ఎత్తుకు ప్రాధాన్యత ఇవ్వకుండా, పర్యావరణ అనుకూలంగా వినాయకచవితి పండుగ చేసుకోవాలని సూచించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి,వినాయక ఉత్సవ కమిటీ నిర్ణయాలను, సూచనలు, సలహాలను బనగానపల్లె నియోజకవర్గం ప్రజలంతా పాటించాలని సూచించిన




మంత్రి,అధికారుల సూచనల మేరకు కైప చెరువు దగ్గర ఒక బోటు, రెండు క్రేన్లు, 5 మంది సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు సహకరిస్తానని తెలిపిన మంత్రి,నా సతీమణి బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో సొంత నిధులతో బనగానపల్లె పట్టణంలో పొట్టి శ్రీరాములు సర్కిల్, పెట్రోల్ బంక్ సర్కిల్ పరిధిలో.. మట్టి వినాయక విగ్రహాలను ఇవ్వనున్నట్లు తెలిపిన మంత్రి,ప్రజలంతా పోలీసులు, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించి, వినాయకచవితి పండుగను భక్తి శ్రద్ధలతో చేసుకోవాలని సూచించిన మంత్రి
అదే సమయంలో ఇతర మతస్తుల మనోభావాలు దెబ్బతినకుండా పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి,గ్రామాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పకుండా పోలీస్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని, మైక్ పర్మిషన్ కోసం చలానా కట్టి అనుమతి తీసుకోవలసి ఉంటుందని, విగ్రహాల దగ్గర అనవసరంగా మత విద్వేషాలను



రెచ్చగొట్టే పాటలు, పెట్టకుండా, ఇతరులకు అసౌకర్యం కలగకుండా భక్తి పూర్వకంగా పండుగ నిర్వహించుకోవాలని సూచించిన పోలీసు ఉన్నతాధికారులు.కైప చెరువు పరిధిలో విగ్రహాలను నిమజ్జనం దగ్గర శాశ్వత ప్రాతిపదికన స్టేజ్ నిర్మాణం చేపట్టాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చిన పోలీసులు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని మంత్రికి తెలియజేసిన పోలీసులు.
రెవెన్యూ, పోలీస్, ఎలక్ట్రికల్ తదితర అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వినాయక చవితి పండుగ ప్రజలందరూ సంతోషంగా జరుపుకునేలా చర్యలు చేపట్టాలని సూచించిన ఆర్టీవో ,వినాయక నిమజ్జన కార్యక్రమంలో భాగంగా వెస్టర్న్ మ్యూజిక్ పాటలకు స్వస్తి పలికి.. ఇతర వర్గాలకు మనోభావాలకు ఇబ్బంది లేకుండా సామరస్యంగా పండుగ నిర్వహించుకోవాలని.. అందుకు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరిన అధికారులు.

# సిపిఐ కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**
నంద్యాల సిపిఐ కార్యాలయంలో 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు జాతీయ జెండాను ఎగరవేయడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు. అనంతరం సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ మొదటి కౌన్సిల్ సమావేశం భూమని శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది.
జాతీయ జెండా పతావిష్కరణ కార్యక్రమానికి. పట్టణ కౌన్సిల్ సమావేశమునకు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు. సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్. సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ .సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె భాస్కర్. సిపిఐ నాయకులు మురళీధర్ .రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న. సిపిఐ గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి. సిపిఐ సీనియర్ నాయకులు సంజీవులు. సిపిఐ ఆత్మకూరు మండల కార్యదర్శి ప్రతాప్ . ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు. మహిళా సమాఖ్య పట్టణ కన్వీన ర్ సుశీలమ్మ హాజరైనారు.
అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ స్వాతంత్రం రాక మునుపు బ్రిటిష్ వారిపై కార్మిక సమస్యలపై కాకుండా సంపూర్ణ స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించి




అజ్ఞాత జీవితాలు గడిపిన నాయకులు కమ్యూనిస్టు పార్టీ నాయకులని గుర్తు చేశారు. స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అయినా కూడా పేదలు ఇంకా పేద వాడిగా. ధనికులు ఇంకా ధని కులుగా మారుతున్నారు తప్ప ఏమీ మార్పు జరగడంలేదని అన్నారు. అదేవిధంగా నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలు అనేకమంది ఉన్నారని అన్నారు పేదల ఇంటి స్థలం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాటాలు నిర్వహించి నంద్యాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించేంతవరకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు హుస్సేన్నా. సాల మద్దిలేటి. సరస్వతి. పద్మావతి. చాంద్ భాషా. షఫీ. జాన్. నాగార్జున. సుబ్బరాయుడు. రమేష్. సుభాష్. శశి. రమీజాబీ. లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో..

# ఘనంగా సాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



**ఆంధ్రప్రదేశ్ నంద్యాల ఆగస్టు 15:** ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మన భారత దేశం, 79వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న శుభ సందర్భంగా భారతీయులకు, ప్రపంచంలోని తెలుగు వారికి, రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు, జాతిపిత మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయులను స్మరించుకుందాం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు, స్వాతంత్ర్యం పొందిన 8 దశాబ్దాల కాలంలో దేశంలో అనేక మార్పులు జరిగాయి. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ కూడా అనేక ఎత్తుపల్లాలను చూసిందని, దేశంలోని తెలుగువారంతా ఒకే రాష్ట్రంగా కలిసి ఉండాలని నాడు కలలుగన్నాం. స్వాతంత్ర్యానికి ముందే విశాలాంధ్ర కోసం పోరాడాం, అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో కర్నూలు రాజధానిగా 1953 అక్టోబర్ 1వ తేదీన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఆ తరువాత 1956 నవంబర్ 1వ తేదీన హైదరాబాద్ రాజధానిగా మొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది. మళ్లీ తిరిగి 2014లో రాష్ట్ర విభజనతో రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఇలా ప్రతిసారీ కొత్త సవాళ్లతో రాష్ట్ర ప్రయాణం సాగింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు డేవిడ్ సుందరం, సిటీ అధ్యక్షులు సత్యం, దిబ్బన్న కార్యవర్గ సభ్యులు, యన్.యం.ఆర్. టైమ్ స్కేల్ రాష్ట్ర నాయకులు వేణుగోపాల్, నాగన్న ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్మయ మిషన్ విద్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

**జాతీయ పతాక ఆవిష్కరణ చేసిన లయన్స్ క్లబ్ నంద్యాల అధ్యక్షులు సోమేసుల నాగరాజు.**

**అవ్వారు గౌరీనాథ్ సౌజన్యంతో విద్యార్థులకు బహుమతుల పంపిణీ.**

**ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు.**



బహుమతులు అందుకున్న బాలలతో పాఠశాల చైర్మన్ కశెట్టి కృష్ణమూర్తి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర రెడ్డి, బహుమతుల దాత అవ్వారు గౌరీనాథ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక చిన్మయ మిషన్ విద్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.
పాఠశాల చైర్మన్ కశెట్టి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు జాతీయ పతాకం ఆవిష్కరించగా, లయన్స్ క్లబ్ సభ్యుడు, ఎ జి ఎన్ జ్యువెలర్స్ యజమాని అవ్వారు గౌరీనాథ్ సౌజన్యంతో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చిన బాలలకు,వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు,మిఠాయిలు పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి తాతి రెడ్డి భాస్కర్ రెడ్డి, సభ్యుడు యూసుఫ్, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో..

# ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**
నంద్యాల పట్టణంలో నడిగడ్డ లోఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కార్యాలయాలు లో 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ జనరల్ సెక్రెటరీ దాల్మిల్ అమీర్ భాష ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న పోరాట యోధుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఎందరో స్వాతంత్ర ఉద్యమ పోరాట నాయకుల త్యాగఫలమే నేటి మన జీవితం అని అన్నారు. ప్రతి పౌరుడు దేశం పట్ల భక్తి శ్రద్ధలను కలిగి ఉండాలని, సమాజంలో బాధ్యతగా వ్యవహరిస్తూ కుటుంబం దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చేలా ప్రతి పౌరుడు వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు రెహమాన్, సత్యం, ఇబ్రహీం ,ఫయాజ్ ,తదితరులు పాల్గొన్నారు.



# సయ్యద్ హాఫీజ్ భాషాకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించిన మంత్రి బీసీ.




**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె ఆగస్టు 15:**బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్మిక బీమా పథకం కింద బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో సయ్యద్ హాఫీజ్ భాషా కు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి చేతులు మీదుగా నేడు అందజేయడం జరిగింది. బనగానపల్లె నియోజకవర్గానికి చెందిన సయ్యద్ హాఫీజ్ భాషా వృత్తి రీత్యా ట్రైలర్ పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. వ్యక్తిగత ఆరోగ్య సమస్యల కారణంగా, కిడ్నీ ఇన్ఫెక్షన్ కావడంతో అత్యవసరంగా ఆసుపత్రిలో చికిత్స చేసుకోవడం జరిగింది.. దీంతో ఆ కుటుంబానికి వైద్యసాయం నిమిత్తం మంత్రి ఆధర్వంలోని బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ రూ. 10 వేలు సాయం అందించి వారికి చేదోడుగా నిలిచింది. బీసీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్మిక బీమా పథకంలో నమోదు చేసుకున్న వారు ఏదైనా ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి రూ. 1 లక్ష ఆర్థిక సాయం, ఏదైనా యాక్సిడెంట్ జరిగితే తక్షణ వైద్య సాయం కోసం దాదాపు రూ. 20 వేలు వరకు సాయం అందించడం ద్వారా బీసీజేఆర్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని కార్మిక బీమాతో బనగానపల్లె నియోజకవర్గ ప్రజల జీవితాల్లో ధీమా కల్పించడం జరుగుతోంది. నిస్వార్థంగా, సేవా దృక్ఫథంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద ప్రజలకు కష్టాల్లో అండగా నిలవడంతో పాటు, ఆపత్కాలంలో ఆదుకుంటున్న తీరుపై బాధిత కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

# కొత్తూరు సుబ్బరాయునికి మొక్కులు తీర్చుకున్న డోన్ ఆర్యవైశ్య భక్తులు..!



**ఆంధ్ర ప్రగతి పాణ్యం. ఎస్.కొత్తూరు. ఆగస్టు 15:**
ప్రముఖ శైవక్షేత్రం నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయ ఈవో యం.రామక్రిష్ణ ఆధ్వర్యంలో శ్రావణ మాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల వీరయ్య శర్మ, నారాయణ శర్మ, కంపమల్ల సురేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలు, గందం అభిషేక పూజలు, రుద్రాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామ ప్రజలతో పాటు చాలా మంది సుదూర ప్రాంతాలనుండి వచ్చిన భక్తులు మరియు డోన్ నుంచి ఆర్యవైశ్య భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. డోన్ ఆర్యవైశ్య భక్తులు ప్రత్యేకించి గత కొన్ని సంవత్సరాలుగా శ్రావణ మాసంలో మూడవ శుక్రవారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో, ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడాలని, పాడిపంటలతో రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు వారు తెలిపారు.

# మాజీ సైనికుల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**
నంద్యాల పట్టణంలోని నంద్యాల జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు సంఘం అధ్యక్షులు రంగనాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఫాంషావలి హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరంలో, ప్రస్తుత దేశ రక్షణలో సైనికుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాజీ సైనికుడు కె. సతీష్ కుమార్ మాట్లాడుతూ భారతదేశం ఆంగ్లేయుల బానిసత్వం నుండి విముక్తి చేయుటకు ఎంతోమంది తమ ప్రాణ త్యాగాలు బలిదానం చేయడం వల్ల మనకు స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. ఆనాడు తమ ప్రాణాలు బలిదానం చేసిన త్యాగమూర్తులను మరియు పోరాటం చేసిన నాయకులను స్మరించుకొని, వారికి నివాళులు అర్పించి ఒక పండుగలా ప్రతియేట జరుపుకుంటారని తెలిపారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు రంగనాయకులు చిన్నసాయి మాట్లాడుతూ సైనికులకు ఎటువంటి సమస్య వచ్చిన తమ దృష్టికి తేవాలని, అందరూ మాజీ సైనికులు కలిసి కట్టుగా సమస్య పరిష్కారం కొరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# దైవభక్తితో పాటు దేశభక్తిని కూడా అలవర్చుకోవాలి.

## డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.

**ఆంధ్ర ప్రగతి ఆదోని ఆగస్టు 15:**
బాల్యం నుండే దైవభక్తితో పాటు దేశభక్తిని కూడా అలవర్చుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదోని మండలం, సలకలకొండ గ్రామంలోని శివాలయం నందు గత నాలుగు రోజులు నుండి జరుగుతున్న ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ముక్కోటి దేవతా స్వరూపమైన గోపూజా మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా



వారు మాట్లాడుతూ శ్రీమద్రామాయణం ద్వారా స్వర్గం కంటే జన్మభూమి గొప్పదన్న శ్రీరామచంద్రుడి యొక్క హితబోధను ఎప్పటికీ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రతాప్ రెడ్డి, ఆదినారాయణ, కృష్ణ చైతన్య రెడ్డి, చిన్న నర్సిరెడ్డి, నల్లన, పూజారి వెంకటరాముడు, నల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఖాసీం, గోవిందు, ఉరుకుంద, హనుమంత రెడ్డి, ఈరన్న, చిన్న ఆంజనేయులుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎం యల్ ఎకోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి చేతుల మీద ఉత్తమ సేవకుడిగా ప్రశంసా పత్రం అందుకుంటున్న మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ ఆగస్ట్ 15:**
డోన్ లో నివసిస్తున్న డాక్టర్ పి.సుల్లన్న కుమారుడు పి.మహమ్మద్ రఫి గత కొన్నేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ మన భారతదేశ స్వతంత్ర్య సమరయోధుల మరియు శాస్త్రవేత్తల, సంఘసంస్కర్తల జయంతులు , వర్ధంతుల గురించి నియోజకవర్గంలోని స్కూల్స్ విద్యార్థులకు, ప్రజలకు తెలియజేస్తూ విద్యార్థుల్లో వారి యొక్క స్ఫూర్తిని నింపుతూ ప్రజలను విద్యార్థులను చైతన్య పరుస్తూ విద్యార్థులకు ఆరోగ్యం పై వాతవరణ కాలుష్యం పై అలాగే బయటదొరికే ఫాస్ట్ ఫుడ్స్ ఆహారం, కల్తీ ఆహర పదార్థాల పై అవగాహణ, వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి. వాతావరణ కాలుష్యానికి హానికరమైన ప్లాస్టిక్ నిరోధించాలి. ప్లాస్టిక్ ని వాడకుండా మన ఆరోగ్యాలు మనమే కాపాడుకోవాలని విరివిగా మొక్కలు నాటి మహావృక్షాలుగా తయారు చేసి వాతావరణ కాలుష్యాన్ని నివారించి ఓజోన్ పరిరక్షణ - ఓజోన్ పొరను రక్షించుకోవాలని స్మార్ట్ ఫోన్ ఎక్కువ వాడకుడదని తెలిపారు. ఎక్కువగా వాడటం ద్వారా జ్ఞాపకశక్తి తగ్గడం, అసహనం, చిరాకు లాంటి పలు రకాల సమస్యలతో పాటు అది వారి మానసిక, శారీరక ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందనిమరణించిన తర్వాత నేత్రదానం, బ్రెయిన్ డెడ్ ,యాక్సిడెంటు అయినటువంటి కేసులలో అవయవాల దానం చెయ్యవచ్చు. ప్రస్తుత సమాజంలో అవయవదానం అవసరం చాలా ఎక్కువ అగుచున్న తరుణంలో ప్రజల్లో విశృత స్థాయిలో అవగాహణ అవసరమన్నారు.ఆడ మగ ఇద్దరూ సమానమేనని, లింగ వివక్ష చూపడం నేరమేనని



తెలియజేశారు. ఆడబిడ్డలను పుట్టనిద్దాం, పెరగనిద్దాం, చదవనిద్దాం. అలాగే బాల్య వివాహాలు చేయకూడదని తెలియజేశారు. పిల్లలతో పని చేయించడం చట్టరిత్య నేరం. పిల్లలను బడిలో చేర్పించాలి. బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే 1098 చైల్డ్ లైన్ కేంద్రానికి సమాచారం అందించాలని విద్యార్థులకు, ప్రజలకుఅవగాహణ కల్పిస్తూన్నారు.మూఢకమ్మకాలపై ,ఓటు హక్కు వినియోగం పై లింగ నిర్ధారణ నివారణ చట్టాలపై,పల్స్ పోలియో పై పాఠశాలల్లో, కాలేజీల్లో విద్యార్థులకు అవగాహణ కార్యక్రమాలు చేస్తూ మరియు పత్రికల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ ప్రజలకు అవగాహణ కల్పిస్తూ సమాజంలో తమ వంతు సామాజిక భాద్యతగా చేస్తున్న సేవలకు గుర్తించి 15-08-2025 డోన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 79వ మన భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో డోన్ ఎం యల్ ఎ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి , డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ చేతుల మీద ఉత్తమ సేవకుడిగా ప్రశంసా పత్రం అందుకున్న సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి అందుకున్నారు.
ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ అవార్డు పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ప్రశంసా పత్రం పొందడం మరింత బాధ్యతను పెంచిందని ప్రజలకు సేవచేయడం తమ వంతు బాధ్యతగా నిర్వహిస్తామని తెలిపారు.స్వాతంత్రసమరయోధులు, శాస్త్రవేత్తలు,సంఘసంస్కర్తలు చేసిన సేవలే ఈనాడు మనం ఇంత సంతోషంగా, స్వేచ్ఛగా జీవిస్తున్నాం. కావున వారిని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత వహించి సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు.

# బాల అకాడమి రవీంద్ర హై స్కూల్ నందు ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**
బాల అకాడమీ రవీంద్ర హై స్కూల్ కస్పాండెంట్ రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ మాధవీ లత మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాధవీ లత మరియు కరెస్పాండెంట్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ఏడున్నర శతాబ్దాల నుండి ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ ఎన్నో పరిమితి గల విద్యావేత్తలు స్వావలంనకు బాటలు వేసిన శాస్త్రవేత్తలు అందరూ కలిసి ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరించారు.బాల అకాడమీ రవీంద్ర హైస్కూల్లో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైనందుకుగాను చాలా సంతోషంగా ఉందని తెలిపారు.వారు విద్యార్థులతో మమేకమై వారితో ముచ్చటిస్తూ విద్యార్థులలో జాతీయోజ్వలనను నింపి రేకెత్తించారు. స్వతంత్ర దినోత్సవం కులాలు మరియు వర్గాలకు అతీతంగా భారతీయులందరిలో దేశభక్తిని మరియు ఐక్యతను తెస్తుందని ఎంతోమంది ప్రజల త్యాగానికి ప్రత్యేక అని కొనియాడుతూ భారతదేశం తన శక్తి సామర్థ్యాల మేరకు అభివృద్ధిని సాధించగలిగింది.




# హిందూపురంలో ఆర్టీసీ బస్సు నడిపిన బాలకృష్ణ...

## హిందూపురంలో 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించిన బాలకృష్ణ

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీకి శ్రీకారం

## ఆర్టీసీ బస్సు స్టీరింగ్ పట్టి అందరినీ ఆశ్చర్యపరిచిన బాలయ్య

## మహిళా ప్రయాణికుల ఆధార్ కార్డులను స్వయంగా తనిఖీ

## బస్టాండ్ నుంచి తన ఇంటి వరకు బస్సు నడిపిన ఎమ్మెల్యే

**హిందూపురం ఆగస్టు 15 ఆంధ్ర ప్రగతి:**
ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆర్టీసీ బస్సు డ్రైవర్ అవతారమెత్తి అందరినీ ఆశ్చర్యపరిచారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'స్త్రీ శక్తి' ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన స్వయంగా స్టీరింగ్ పట్టి బస్సు నడిపారు. ఈ పరిణామం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో శుక్రవారం చోటుచేసుకుంది.



వివరాల్లోకి వెళితే, ఎన్నికల హామీలలో భాగమైన 'సూపర్ సిక్స్' పథకాలలో ఒకటైన 'స్త్రీ శక్తి'ని ప్రభుత్వం ప్రారంభించింది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే ఈ పథకాన్ని బాలకృష్ణ తన నియోజకవర్గంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం కోసం హిందూపురం ఆర్టీసీ బస్ స్టేషన్‌కు అభిమానుల కోలాహలం మధ్య చేరుకున్న ఆయన, ముందుగా రిబ్బన్ కట్ చేసి పథకానికి శ్రీకారం చుట్టారు.
అనంతరం ఓ బస్సులోకి ఎక్కి, అందులో ప్రయాణిస్తున్న మహిళలతో ముచ్చటించారు. వారి



ఆధార్ కార్డులను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ జాతీయ జెండా ఊపి బస్సును ప్రారంభించగా, బాలకృష్ణ డ్రైవర్ సీటులో ఆసీనులయ్యారు. బస్ స్టేషన్ నుంచి పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో ఉన్న తన నివాసం వరకు బస్సును నడుపుకుంటూ వెళ్లారు. తమ ఎమ్మెల్యేనే బస్సు నడపడంతో ప్రయాణికులు, స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

# ఉత్తమ సేవ పురస్కారాన్ని అందుకున్న నాగమణి

**కర్నూలుఆగస్టు 15 ఆంధ్ర ప్రగతి:**
79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన పలు విభాగాల సిబ్బందికి ఆసుపత్రి సూపెరిండేంట్ మరియు నర్సింగ్ సూపెరిండేంట్ ప్రశంసా పత్రాలు అందజేశారు.ఎఫ్ ఎన్ ఓ హెూదాలో ఎస్ .నాగమణి తమ నిబద్ధతతో, సమయపాలనతో విశేష ఫలితాలు సాధించినందుకు నర్సింగ్ సూపెరిండేంట్ సావిత్రిబాయి చేతుల మీదు గా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకొన్నారు. ఈ క్రమంలో నర్సింగ్ సూపెరిండేంట్ సావిత్రిబాయి ఎస్ .నాగమణి కి ప్రశంసలు తెలుపుతూ, భవిష్యత్తులో మరింత సేవాస్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు డాక్టర్లు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**నంద్యాల జిల్లాలో "స్త్రీ శక్తి" పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంను జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాతో కలిసి ప్రారంభించిన రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు మౌలిక సదుపాయా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, నంద్యాల పట్టణంలోని బస్టాండ్ నుండి బనగానపల్లె కు వెళ్ళే బస్ సర్వీస్ లో జిల్లా కలెక్టర్, సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి.. మహిళా సోదరీమణులతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ఫ్రీ ఫేర్ టికెట్ ను అందించి ఉచిత బస్సు ప్రయాణంను ప్రారంభించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి,ఈ బస్సు ప్రయాణంలో ఆయా మహిళల ఆర్థిక పరిస్థితులు, సాధకబాధకాలు, స్త్రీశక్తి పథకం మహిళలకు ఎంతమేరకు ఉపయోగరమనే విషయాలు ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్న మంత్రి, కూటమి ప్రభుత్వ పాలన, సంక్షేమ %-% అభివృద్ధి కార్యక్రమాలపై బస్సులో మహిళా ప్రయాణీకుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్న మంత్రి,ఈ సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అంటూ తమ అభిప్రాయాలను మంత్రితో పంచుకున్న మహిళా సోదరీమణులు, కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ఇచ్చిన హామీ మేరకు స్త్రీ శక్తి పథకంను అమలు చేస్తున్నామని, మహిళలంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పింఛన్ రూ. 3 నుంచి 4 వేలకు పెంచడం, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు విజయవంతంగా అమలు చేశాం.. తాజాగా నేడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం సంతోషకరం.తొలుత ఉచిత బస్సు ప్రయాణం జిల్లా వరకే పరిమితం చేయాలని ఆలోచించినప్పటికీ, మహిళలకు ఎక్కువ ప్రయోజనం చేకూర్చాలనే ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించాం.ఈ పథకంలో భాగంగా (పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్) 5 రకాల బస్సుల్లో ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడీ కార్డుతో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చు.ఈ పథకం వల్ల మహిళలకు రూ. 1500 నుంచి రూ. 3 వేలు వరకు నెలకు ఆదా అయ్యే పరిస్థితి. నేడు రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకాన్ని అమలు చేస్తోంది.ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో అదనపు బస్సుల అవసరం ఉంటుందని భావించి, కొత్త బస్సులకు ప్రభుత్వం ఇప్పటికే ఆర్డర్ ఇవ్వడం జరిగింది. ఉచిత బస్సు ప్రయాణం వల్ల చిరు వ్యాపారులకు, ఉద్యోగులకు, దూర ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు ఈ పథకం ద్వారా ఆర్థికంగా వెసులబాటు కల్పిస్తోంది.

## స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి.

**జాతీయ పతాకాన్ని ఎగురవేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 15:**
దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. గురువారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా కలెక్టరేట్ లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రామునాయక్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ....స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టారని వారి త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమన్నారు. మనమందరం వారిని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు ముందుకు వెళ్లాలన్నారు.అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి జిల్లాను అభివృద్ధి పదంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు.

## 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న తాటికొండ బుగ్గరాముడు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**
మాతృ భూమి కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన ఎంతో మంది త్యాగధనులను స్మరించుకుంటూ, వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ నంద్యాల పట్టణంలోని స్థానిక 38వ వార్డు నందమూరి నగర్ నందు గల ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు 79వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు.ఈ కార్యక్రమంలో బుగ్గరాముడు మాట్లాడుతూ గతంలో 7వ తరగతి వరకు ఉన్న పాఠశాల ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉన్నత పాఠశాల గా 10వ తరగతి వరకు ఏర్పాటు చేయడం జరిగింది అని ఆయన అన్నారు.అదే విధంగా నంద్యాల ఎమ్మెల్యే,రాష్ట్ర న్యాయ,మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్, వారి కుమారులు ఫిరోజ్, ఫయాజ్ ల ఆధ్వర్యంలో పాఠశాల నందు పలు అభివృద్ధి పనులు చేపడతాం అని ఆయన అన్నారు.అంతేకాక ఆఫీస్ రూమ్ నందు ఒక ర్యాగింగ్ చైర్ కావాలి హెడ్ మాస్టర్ అడగగా వెంటనే ఇంచార్జ్ బుగ్గరాముడు స్పందించి పాఠశాలకు ఒక ర్యాగింగ్ చైర్ కూడా ఇప్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా 79 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఆగస్టు 15:**
నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మెదటగా పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి అనంతరం జాతీయజెండాను జాతీయ జెండాను ఆవిష్కరించారు.సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం స్వాతంత్ర సమరయోధులు చేసిన త్యాగాలను గుర్తు చేస్తూ స్వాతంత్ర్యం సాధించడం కోసం వారు పడిన శ్రమలను మరియు అర్పించిన ప్రాణ త్యాగాలను గురించి వివరించారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని దేశభక్తిని భావితరాలకు అందించే దిశగా సమిష్టిగా కృషి చేయాలని తెలియజేశారు.పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి సేవ పతకాలు అందజేసి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి ఎం.జావళి,అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి పోలీసు కార్యాలయ సిబ్బంది టౌన్ అదికారులు పాల్గొన్నారు.

## బొప్పన సుజాతకు స్మారక ప్రశంసా పత్రం అందజేసిన మంత్రి బిసి,కలెక్టర్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:** 79వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులను స్మరిస్తూ విశిష్ట సేవలు అందజేసిన వారికి ప్రశంస పత్రాలు అందజేయడంలో భాగంగా నంద్యాల ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలోనే అవయవదానం చేసిన మొట్టమొదటి మహిళ బొప్పన సుజాత సేవలను స్మరిస్తూ జిల్లా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గౌరవ జిల్లా కలెక్టర్ రాజకుమారి, సుజాత తల్లిదండ్రులకు కమెండేషన్ సర్టిఫికెట్ను అందజేశారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు దస్తగిరి పర్ల నాగేశ్వరరావు ఉస్మాన్ భాష మద్దిలేటి డిఎఫ్ఓ అబ్దుల్ సమీ సుజాత తల్లిదండ్రులు పుల్లమ్మ నాగేంద్ర గౌడ్ సోదరుడు సునీల్ సోదరి విజయ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడు మంది జీవితాలలో వెలుగు నింపిన సుజాత అవయవదానానికి సహకరించిన వారి కుటుంబ సభ్యులకు రెడ్ క్రాస్ వారు ధన్యవాదాలు తెలియజేశారు.

## రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**
ఎందరో వీరులు, యోధులు నేలతల్లి రుణం తీర్చుకోవడానికి తమ ప్రాణాలను అర్పించారనీ ఆ మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం నంద్యాల సమితి కార్యాలయంలో 79 వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వతంత్ర వేడుకలను సమితి కార్యవర్గ సభ్యులు ఘనంగా జరిపారు.ఈ సందర్భంగా వేడుకలలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ..కులమతాలకు అతీతంగా బీద గొప్ప తేడా లేకుండా భిన్నత్వంలో ఏకత్వముగా మన భరత జాతి ఖ్యాతిని నిలబెట్టే పండుగ ఇదని తెలిపారు.స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్నా చాలా ప్రాంతాలలో త్రాగు, సాగు నీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేసినప్పుడే స్వతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలకు ఫలితం వుంటుందని స్పష్టం చేసారు. ఈ జెండా పండుగ వేడుకలలో సమితి కార్యవర్గ సభ్యులు ఏరువ రామచంద్రారెడ్డి, చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, మహమ్మద్ ఫర్వేజ్, మహేశ్వరరెడ్డి, సౌదాగర్ ఖాసీం మియా, నిట్టూరు సుధాకర్ రావు, కొమ్మా శ్రీహరి, భాస్కర్ రెడ్డి, పట్నం రాముడు, మహబూబ్ భాష, న్యాయవాది అసదుల్లా, కృష్ణమోహన్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## స్టార్ సొసైటీ ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:** నంద్యాల పట్టణం నందమూరి నగర్ లో స్టార్ సొసైటీ ద్వారా నిర్వహించబడుతున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియ విద్యాలయ హాస్టల్ నందు మాతృ భూమి కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన ఎంతో మంది త్యాగధనులను స్మరించుకుంటూ, వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ నంద్యాల పట్టణంలోని నందమూరి నగర్ నందు గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవసియ విద్యాలయ హాస్టల్ 79వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న సమగ్ర శిక్ష ప్రత్యామ్నేయ పాఠశాలల కోఆర్డినేటర్ ఎం ప్రసన్న కుమార్, ఎం ఐ ఎస్ ప్లానింగ్ కోఆర్డినేటర్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూమాట్లాడుతూ దేశం కోసం ఎందరో మహానుభావులు త్యాగఫలం వల్ల మనకు స్వాతంత్రం వచ్చిందని ఈరోజు మనము స్వేచ్ఛగా జీవిస్తున్నామని పిల్లలకు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గడ్డం సుబ్బరాయుడు, హాస్టల్ వార్డెన్ నాగలక్ష్మి, ఎరుకల రాజేశ్వరమ్మ,టీచర్లు లక్ష్మీదేవి, సౌజన్య, విద్యార్థులు, పాల్గొన్నారు.

## స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి.

**-ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 15:**
దేశ స్వతంత్రం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, పేర్కొన్నారు. శుక్రవారం 79 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా నంద్యాల పట్టణంలోని ఉన్న శ్రీనివాస్ నగర్ నందు ఐడియల్ కంప్యూటర్ ఇన్స్టిట్యూషన్ లో జాతీయ పతాకాన్ని ఎగరవేసి విద్యార్థిని విద్యార్థులతో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, నంద్యాల మార్కెట్ డైరెక్టర్ స్వామి నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం బాలనాయక్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టారని వారు త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్రమన్నారు. మనమందరం వారిని ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు ముందుకు వెళ్లాలన్నారు. స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచిన ఇప్పటికీ సమాజంలో చాలామంది యువకులు ఉద్యోగాలు లేక అలమటిస్తున్నారని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. అదేవిధంగా ఐడియల్ కంప్యూటర్స్ ఇన్స్టిట్యూషన్ ద్వారా ఎంతోమంది గిరిజన యువతకు కంప్యూటర్ కోర్సు చక్కటి శిక్షణ అందిస్తున్నారని, పెరిగిన టెక్నాలజీ ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికి కంప్యూటర్ చాలా అవసరం అన్నారు. ఏ ఉద్యోగం పొందాలన్నా ముందుగా కంప్యూటర్ కోర్సును ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. నంద్యాలలో అందరికీ అందుబాటులో ఉండేలా పరిసర ప్రాంత ప్రజలకు అతి తక్కువ ఫీజుతో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. ఐడియల్ కంప్యూటర్ స్థాపించి విద్యార్థులకు మెరుగైన కంప్యూటర్ శిక్షణ అందించిన ఐడియల్ కంప్యూటర్ మేనేజింగ్ డైరెక్టర్ దేవేంద్ర నాయక్ ను అభినందించారు. అనంతరం కంప్యూటర్ కోర్సులో ప్రతిభ చూపిన విద్యార్థులకు గౌరవ అతిథుల చేత బహుమతులను ప్రదానం చేశారు. గుర్తుగా మెమొంటోలను అందజేశారు.

# వెంకీ, త్రివిక్రమ్ కాంబో

### పూజా కార్యక్రమాలతో ప్రారంభం



'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకున్న నటుడు విక్టరీ వెంకటేశ్ చాలా రోజుల తర్వాత తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్ గురించి అప్‌డేట్‌ని ఇచ్చాడు. తన తదుపరి చిత్రం దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో చేయబోతున్నట్లు- ప్రకటించాడు. ఇండిపెండెన్స్ డే కానుకగా.. ఈ ప్రాజెక్ట్ పూజ కార్యక్రామాలు పూర్తి చేసుకుంది. వెంకటేశ్ సోదరుడు సురేష్ బాబు ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేశాడు. ఈ చిత్రాన్ని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మించనున్నట్లు- తెలుస్తోంది. వెంకీ 77 అనే వర్కింగ్ -టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే షూటింగ్‌ను మొదలుపెట్టబోతుండగా ప్రాజెక్ట్‌కి సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడించనున్నట్లు- చిత్రబృందం తెలిపింది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శకుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అవ్వడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.

# పెళ్లి పీటలెక్కిన టాలీవుడ్ యువ హీరో విశ్వంత్



టాలీవుడ్ యువ హీరో విశ్వంత్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. భావన అనే యువతిని పెళ్లాడిన విశ్వంత్ తన జీవితంలోని కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టారు. తన పెళ్లికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఈ క్యూట్ కపుల్‌కి అభిమానులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.ఎలాంటి హడావిడి లేకుండా సింపుల్‌గా మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు ఈ జంట. ప్రస్తుతం వారి పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఏపీలోని సామర్లకోటకు చెందిన విశ్వంత్, కోయంబత్తూరులో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన సమయంలోనే దిల్ రాజు బ్యానర్‌లో తెరకెక్కిన 'కేరింత' సినిమాలో నటించే అవకాశం వచ్చింది.అప్పుడే సినిమా పట్ల ఆసక్తితో ఇంజినీరింగ్ మధ్యలోనే వదిలేసి సినీ పరిశ్రమలో అడుగుపెట్టాడు. 'కేరింత' చిత్రం మంచి హిట్ కావడంతో విశ్వంత్‌కి అవకాశాలు క్యూ కట్టాయి. ఓ పిట్ట కథ, జెర్సీ, హైడ్ అండ్ సీక్, కథ వెనక కథ, తోలుబొమ్మలాట, ఆ అమ్మాయి గురించి మీకు చెబుతా, బాయ్ ఫ్రెండ్ ఫర్ హైర్, మ్యాచ్ ఫిక్సింగ్, గేమ్ ఛేంజర్ వంటి చిత్రాలలో నటించాడు. హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించి తనను తాను నిరూపించుకున్నాడు. ఇప్పుడు విశ్వంత్ వివాహ బంధంలోకి అడుగుపెట్టడంతో అతని నూతన జీవితం ఆనందంగా సాగాలని, సినిమాల్లో మరింత విజయం సాధించాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

### బిపాసాపై గతంలో చేసిన వ్యాఖ్యలు వైరల్

# క్షమాపణలు చెప్పిన మృణాల్ ఠాకూర్



మృణాల్ ఠాకూర్ ఈ మధ్య వరుస కాంట్రవర్సీల్లో ఇరుక్కుంటోంది. మొన్ననే ధనుష్ తో డేటింగ్ అంటూ వార్తల్లోకి ఎక్కింది. అది నిజం కాదంటూ ఎట్టకేలకు క్లారిటీ- ఇచ్చింది. ఇప్పుడు ఆమె పాత వీడియోపై తెగ కాంట్రవర్సీ నడుస్తోంది. దానిపై తాజాగా క్షమాపణలు చెప్పింది. గతంలో బిపాసా బసు మీద చేసిన పాత వీడియో వైరల్ కావడంతో మృణాల్ పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దాంతో ఇన్ స్టాలో పోస్టు పెట్టింది మృణాల్. తాను 19 ఏళ్ల వయసులో అలా మాట్లాడానని.. అప్పుడు తెలివి తక్కువగా మాట్లాడినట్టు- ఒప్పుకుంది. అప్పుడు నాకు పెద్దగా తెలియదు. అసలైన అందం అంటే ఏంటో ఇప్పుడే నాకు తెలుస్తోంది. అది చాలా విలువైంది. మనసుతో చూసే దాంట్లోనే అందం ఉంటుంది. కంటితో కాదు. అప్పుడు తప్పుగా మాట్లాడాను అని నాకు ఇప్పుడు అర్థం అవుతోంది. అది ఇంత పెద్ద ఇష్యూ అవుతుందని అనుకోలేదు అంటూ క్షమాపణలు చెప్పింది మృణాల్. అసలు విషయం ఏంటంటే.. మృణాల్ 19 ఏళ్ల వయసులో ఓ ఇంటర్వ్యూలో బిపాసా బసుపై సె-టైర్లు వేసింది. బిపాసా బసు కంటే తానే అందంగా ఉంటానని చెప్పింది. బిపాసా కండలు తిరిగిన మగవారిలాగా ఉంటు-ందని.. ఆమె కంటే తాను బెటర్ అంటూ చెప్పింది. ఈ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. బాలీవుడ్ సెలబ్రిటీ-లు మృణాల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిపాసా కూడా ఫైర్ అయింది. దెబ్బకు మృణాల్ దిగొచ్చి సారీ చెప్పింది.

# అనుష్క తర్వాత రేసులో సమంత!





రిలీజ్ తో లోకేష్ కనగరాజ్ ఫ్రీ అయిపోయాడు. తదుపరి కర్తవ్యం ఎల్ సీ యూ నుంచి %-%ఖైదీ 2%-%ని పట్టాలెక్కించడమే. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు బ్యాకెండ్ టీమ్ నిర్వహిస్తోంది. రేపటి నుంచి ఆ పను లు మరింత వేగవంత కానున్నాయి. కార్తీ కూడా వీలైనంత త్వరంగా ఆన్ సెట్స్ లోఉన్న ప్రాజెక్టు పూర్తి చేసి లోకేష్ టీమ్ తో కలవాడినికి రెడీ అవుతున్నాడు.

ఈసారి ప్రాజెక్ట్ లోకి లోకేష్ లేడీ భామల్ని కూడా తెరపైకి తెస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఇప్పటికే ఓ కీలకపాత్రకు స్వీటీ అనుష్క పేరును పరిశీలి స్తున్నట్లు తెరపైకి వచ్చింది. అనుష్క సైతం ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఆమె పాత్ర వివరాలు రివీల్ కాలేదుగానీ లోకీ టీమ్ తో మాత్రం ఇంటరాక్ట్ అవుతున్నట్లు కోలీవుడ్ మీడియాలో బలమైన ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రాజెక్ట్ రేసులోకి సమంత పేరు తెరపైకి వస్తోంది. సమంతను కూడా ఓ కీలక పాత్రకు పరిశీలిస్తున్నట్లు వినిపిస్తుంది. మరి సమంత రోల్ సపరేటా? ఒకే పాత్ర కోసం అనుష్క, సమంత పేర్లు పరిశీలిస్తున్నారా? అన్నది తేలాల్సిన అంశం. ఎల్ సీ యూ నుంచి రిలీజ్ అయిన ఖైదీ, విక్రమ్ లో లేడీ భామలు ఎక్కడా కనిపించలేదు. అందులో కథ అంతా మేల్ పాత్రల చుట్టూనే నడిపించాడు లోకీ. పాటలకు ఛాన్స్ తీసుకోలేదు. స్టోరీ.. ..గ్రి ప్పింగ్ స్క్రీన్ ప్లేతోనే ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేసాడు. ఈ నేపథ్యంలో ఎల్ సీయూలో అందమైన భామలు యాడ్ అయితే తెర పరిపూర్ణమయ్యేది? అన్న అంశం చర్చకొచ్చింది. ఈ నేపథ్యంలో %-%ఖైదీ 2%-%కి హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ ప్రచారంలో నిజానిజాలు తేలాల్సి ఉంది. సమంత కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. %-%ఖుషీ %-% తర్వాత హీరోయిన్ గా మ్యాకప్ వేసుకోలేదు. బాలీవుడ్ లో వెబ్ సిరీస్ లు చేయడం తప్ప హీరోయిన్ ఛాన్స్ తీసుకోలేదు. అటు అనుష్క కూడా సీరియస్ గా కెరీర్ ని పట్టాలెక్కించడం లేదు. త్వరలో %-%ఘాటీ%-%తో ప్రేక్షకుల ముందకు రానుంది. ఈ సినిమా మంచి కంబ్యాక్ చిత్రంగా నిలుస్తుందని స్వీటీ కాన్ఫిడెంట్ గా ఉంది. మరో రెండు..మూడు కథలు విని హోల్డ్ లో పెట్టింది. అందులో ఒకటిగా %-%ఖైదీ 2%-% ఉంది. మరి సమంత, అనుష్క ఎంట్రీపై లోకేష్ స్పందిస్తే తప్ప క్లారిటీ రాదు.

# రూ.80 కోట్లతో... హీరోయిన్ కృతి రికార్డ్!



బాలీవుడ్ స్టార్స్ ఎక్కువగా రియల్ ఎస్టేట్ పై పెట్టుబడులు పెడుతూ ఉంటారు. పదుల కోట్లు ఖర్చు చేసి ఖరీదైన విల్లాలు, అపార్ట్‌మెంట్‌లను కొనుగోలు చేయడం మనం చూస్తూ ఉంటాం. ముఖ్యంగా సముద్రం ఫేసింగ్‌తో ఉన్న అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్స్ ను కొనుగోలు చేసేందుకు స్టార్స్ ఆసక్తి చూపిస్తూ ఉంటారు. ముంబైలోని ఖరీదైన ఏరియాల్లో హీరోలు, హీరోయిన్స్ పదుల కోట్లు ఖర్చు చేసి ఇండిపెండెంట్ హౌస్ లేదా అపార్ట్‌మెంట్ ఫ్లాట్ కొనుగోలు చేయడం జరిగింది. ఇంకా ఎంతో మంది స్టార్స్ తమ స్టార్ స్టేటస్‌కి తగ్గట్లుగా ఖరీదైన ఇళ్లను కొనుగోలు చేస్తూనే ఉన్నారు. ఇండస్ట్రీకి చెందిన ఎంతో మంది ప్రముఖులు ముంబైలోని పాలిహిల్ లో ఫ్లాట్ కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తూ ఉంటారు. ఆ ఖరీదైన ఏరియాలో హీరోయిన్ కృతి సనన్ ఇల్లు కొనుగోలు చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో వరుసగా నిరాశను చవిచూసిన కృతి సనన్ ఇప్పుడు బాలీవుడ్‌లో స్టార్‌గా దూసుకు పోతుంది. నేషనల్ అవార్డ్‌ను సొంతం చేసుకున్న ఈ అమ్మడు మరిన్ని సినిమాల్లో నటిస్తూ స్టార్‌డం దక్కించుకుంది. సినిమాకు దాదాపు రూ.10 కోట్లకు మించి పారితోషికంను ఈ అమ్మడు తీసుకుంటూ ఉంది. బాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా ఈ అమ్మడు వరుస సినిమాలు చేసుకుంటూ వెళ్తుంది. ఆకట్టుకునే అందంతో పాటు, నటిగా మంచి ప్రతిభ ఉన్న ఈ అమ్మడికి బాలీవుడ్ స్టార్స్ నుంచి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ముందు ముందు సౌత్‌లో ఈమె మరిన్ని సినిమాలు చేసేందుకు రెడీ అన్నట్లుగా వెయిట్ చేస్తుంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడంతో ఎక్కువగా సినిమా ఆఫర్లు ఈ అమ్మడి తలుపు తడుతున్నాయి.రూ.78.20 కోట్లతో కృతి సనన్ ఇల్లు ఇక ఈమె తీసుకున్న ఖరీదైన అపార్ట్‌మెంట్ ఫ్లాట్ గురించి బాలీవుడ్ మీడియాలో ప్రముఖంగా చర్చ జరుగుతోంది.




# బెల్లంకొండ 'కిష్కిందపురి' టీజర్

'భైరవం' తరువాత కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటించిన మరో చిత్రం 'కిష్కిందపురి' విడుదలకు ముస్తాబవుతోంది. సెప్టెంబరు 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. అనుపమ పరమేశ్వరన్ నాయికగా నటించిన ఈ చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి దర్శకుడు. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా శుక్రవారం టీజర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. టీజర్‌ను గమనిస్తే.. మిస్టీరియస్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం తెరకెక్కినట్లుగా తెలుస్తోంది. ఒక పాత భవనంలోకి వెళ్లిన ఓ అమ్మాయి ఒక్కసారిగా అదృశ్యం అవుతుంది. అక్కడే రేడియో నుంచి ఆకాశవాణి ప్రసారాలు ప్రారంభం అనే సందేశం వస్తుంది. కథలో హారర్ అంశాలే ఎక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. తొలిసారిగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటించిన మిస్టీరియస్ థ్రిల్లర్ ఇది. అయితే గత కొంత కాలంగా హారర్ మిస్టరీయస్ సినిమాలు ఒకే కథాంశంతో.. రొటిన్‌గా ఉండే అంశాల మేళవింపుతో వస్తుండటంతో ప్రేక్షకాదరణ ఇలాంటి సినిమాలకు ఉండటం లేదు. తాజాగా 'కిష్కిందపురి' టీజర్ చూస్తుంటే మాత్రం ఈ చిత్రంలో దర్శకుడు నవ్యమైన అంశంతో ఈ చిత్రాన్ని ప్రెజెంట్ చేస్తున్నట్లుగా కనిపించింది. చైతన్య భరద్వాజ్ నేపథ్య సంగీతం బాగుంది.